Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 100 మేడ్చల్ మల్కాజ్‌గిరి 2 మే 2023 మంగళవారం పేజీలు : 4

## 'అమర్‌నాథ్ యాత్ర'పై ఉగ్ర కుట్ర.. రహస్య సొరంగం గుర్తింపు

జమ్మూ: త్వరలోనే జరగబోయే వార్షిక అమరనాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు చేసిన కుట్రను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది భగ్నం చేశారు. జమ్మూ కశ్మీర్‌లో అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఓ రహస్య సొరంగాన్ని గుర్తించారు. సాంబా జిల్లాలోని చాక్ ఫఖీరా బోర్డర్ అవుట్‌పోస్ట్‌కు సమీపంలోని 150 మీ టర్ల సొరంగం ఉన్నట్లు గుర్తించామని బీఎస్ ఎఫ్ అధికారులు వెల్లడించారు. ఈ సొరంగాన్ని ఇటీవలే తవ్వారని, పాక్ భూభాగం నుంచే ఈ సొరంగం ఉన్నట్లు బీఎస్ఎఫ్ డీఐజీ ఎస్‌పీఎస్ సంధు తెలిపారు. అవుట్‌పోస్ట్‌కు కేవలం 300 మీటర్ల దూరంలోనే ఇది ఉన్నట్లు తెలిపారు. ఈ సొరంగం నుంచి భారత్‌లోని చివరి గ్రామానికి దూరం కేవలం 700 మీటర్లేనని చెప్పారు. అమర్‌నాథ్ యాత్రకు భంగం కలిగించేందుకు ముష్కరులు ఈ సొరంగం నుంచి భారత భూభాగంలోకి చొరబడేలా ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది.





## ఉమ్మడి మహబూబ్‌నగర్ - రంగారెడ్డి జిల్లాలకు

# తీరనున్న తాగునీటి కష్టాలు

## జులై వరకు కరివెన జలాశయానికి నీటిని తరలించాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్ : కొత్తగా నిర్మించిన సచివాలయంలో తొలిసారి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సుప్రీంకోర్టు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో తాగునీటి పనులను కొనసాగించేందుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించిన పనుల పురోగతిపై సీఎం కూలంకంషంగా చర్చించారు. ఇందులో భాగంగా జులై వరకు కరివెన జలాశయంకు నీళ్లు తరలించాలని, ఆగస్ట్ వరకు ఉద్దండాపూర్ వరకు నీటిని ఎత్తిపోయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నార్లపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉద్దండాపూర్ జలాశయాల మిగిలి పోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని.. పంప్‌హౌస్‌లు, విద్యుత్ సబ్ స్టేషన్లు, కన్వేయర్ సిస్టమ్‌లోని పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాలమూరు జిల్లాలో ఉన్న కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ పనులకు సంబంధించిన పురోగతిపై సమీక్షించారు. మిగిలిన కొద్దిపాటి పనులను ఈ జూన్ లోగా పూర్తి చేయాలని అధికారులను సీఎం సూచించారు. సమీక్షా సమావేశంలో మంత్రులు నిరంజన్ రెడ్డి, వీ శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎంపీలు పోతుగంటి రాములు, మన్నె శ్రీనివాస్ రెడ్డి, రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్‌రెడ్డి, కాలె యాదయ్య, ఆళ్ల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, ఎస్ రాజేందర్ రెడ్డి, గువ్వల బాలరాజు, హర్షవర్ధన్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, అంజయ్య యాదవ్, ప్రకాశ్ గౌడ్, మహేశ్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, జైపాల్ యాదవ్, మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు, ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్ కుమార్, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్ పాండే, ఈఎన్సీ మురళీధర్ రావు, లిఫ్ట్ ఇరిగేషన్ అడ్వైజర్ పెంటారెడ్డి, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, సీఈలు హమీద్ ఖాన్, ధర్మా, ఎస్ఈలు రంగారెడ్డి, శ్రీనివాస్, విజయ భాస్కర్‌రెడ్డి, చక్రధర్, ఏఎస్ఎన్ రెడ్డి, ట్రాన్స్ కో డైరెక్టర్ సూర్య ప్రకాశ్, డీఈ సయ్యద్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

## 8న రామగుండం కమిషనరేట్‌ను ప్రారంభించనున్న కేటీఆర్

కొత్తగా నిర్మించిన రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 8న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా తెలిపారు. పోలీస్ కమి షనర్ రెమా రాజేశ్వరితో కలిసి నూతనంగా నిర్మించిన పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని సందర్శించి, ఈ సందర్భంగా కమిషనర్ ఛాంబర్, అడిషనల్ డీసీపీల చాంబర్స్, కాన్ఫరెన్స్ హాల్, గ్రీవెన్స్ సెల్ హాల్, సీసీ కెమెరాల



కమాండ్ కంట్రోల్ రూమ్స్, మీటింగ్ హాల్, రిసెప్షన్ కౌంటర్, కమిషనర్ కార్యాలయ వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది రూమ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా దామోదర్ గుప్తా మాట్లాడుతూ 28 ఎకరాల స్థలంలో రూ. 38.50కోట్ల వ్యయంతో అధునాతన హంగులతో పోలీసు కమిషనరేట్ భవనాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్లో టికెట్ రాని వారి లిస్ట్ ఇదేనా!?

సరిగా పనిచేయనివారికి అవినీతిపరులకు టికెట్ ఇచ్చేది లేదని కేసీఆర్ ఇటీవల చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో టికెట్ దొరకని ఎమ్మెల్యేలు ఎవరనే చర్చ జిల్లాల్లో జరుగుతోంది. అన్నిటికంటే అధికంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అయిదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కు ఈసారి టికెట్ రాదని అక్కడ కొత్త వారికి టికెట్లు ఇస్తారని బీఆర్ఎస్ వర్గాల నుంచి వినిపిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సిర్పూర్ ఎమ్మెల్యే కోనప్పలకు టికెట్లు రావని బీఆర్ఎస్ వర్గాల నుంచే వినిపిస్తోంది. మిగతా కొందరి పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. బాల్క సుమన్ కు కూడా అనుమానమేనంటున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వచ్చేసరికి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి నిజామాబాద్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ కూడా ఈ లిస్టులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ లకు టికెట్ అనుమానమే. పాత మెదక్ జిల్లాలో పెద్దగా పేర్లేమీ ప్రచారంలో లేనప్పటికీ నారాయన్ ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి పేరు వినిపిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఈసారి మొండిచేయి తప్పదంటున్నారు. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ లోకి వచ్చిన రోహిత్ రెడ్డికీ టికెట్ అనుమానమే. హైదరాబాద్ జిల్లాలో

## 'ఇంటా.. బయటా.. ఇదే చర్చ'

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్కు కూడా మొండిచేయి తప్పదంటున్నారు. మహబూబ్ నగర్ పాత జిల్లాలో అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ల పేర్లు వినిపిస్తున్నాయి ఉమ్మడి నల్గొండ జిల్లాలో కోదాడలో మల్లయ్య యాదవ్ ను తుంగతుర్తిలో గాదరి కిశోర్ను మార్చొచ్చు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వినిపిస్తున్న మొట్టమొదటి పేరు స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పేరు. డోర్నకల్లో రెడ్యా నాయక్ జనగామలో యాదగిరి రెడ్డినీ తప్పించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది. ఖమ్మం పాత జిల్లాలో కాంగ్రెస్ నుంచి వచ్చిన పినపాక ఎమ్మెల్యే కాంతారావు కొత్త గూడెం లో వనమా వెంకటేశ్వరరావుల పాలేరులో కందాల ఉపేందర్ రెడ్డిలకు టికెట్ రాదని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

# సఫాయన్న నీకు సలాం అన్న...

## లక్షకు పైగా ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు నెలకు వెయ్యి జీతం పెంపు...



# సీఎం కెసిఆర్ 'మే డే' కానుక

హైదరాబాద్ : మే డే' కానుకగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,06,474 మంది పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలను నెలకు తలా 1,000 (వెయ్యి) రూపాయల చొప్పున పెంచాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. జిహెచ్ఎంసి, మెట్రో వాటర్ వర్క్స తో పాటు, రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలల్లో పనిచేస్తూ ప్రస్తుతం జీతం అందుకుంటున్న పారిశుద్ధ్య కార్మికులందరికీ నెల, నెలా పెరిగిన వేయి రూపాయల వేతనం అదనంగా జీతంతో పాటు కలిపి అందుతుందని సీఎం తెలిపారు. పెరిగిన వేతనాలు తక్షణమే అమలులోకి వస్తాయని సీఎం తెలిపారు. 'సఫాయన్న నీకు సలాం అన్న' అనే నినాదంతో పారిశుద్ధ్య కార్మికుల కృషిని, త్యాగాలను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుండి గుర్తిస్తూ వారి సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నదని సీఎం అన్నారు. రాష్ట్రంలో కష్టించి పనిచేసే ప్రతీ ఒక్క కార్మికుని సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికుల జీతాలు కూడా పెంచాలని నిర్ణయించామని, ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్థిక శాఖను ఆదేశించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణ పల్లెలు, పట్టణాలు గుణాత్మక అభివృద్ధిని సాధించడంలో పారిశుద్ధ్య కార్మికుల శ్రమ గొప్పదన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన పల్లెలు, పట్టణాలకు అవార్డులు రావడం వెనుక వీరి కృషి దాగి ఉన్నదని సీఎం తెలిపారు. పల్లెలు, పట్టణాల్లో నాటి, నేటి పరిస్థితులకు ఎంతో స్పష్టమైన తేడా ఉన్నదని సీఎం అన్నారు. కార్మికుల కష్టసుఖాలను తెలుసుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వం స్పంది స్తూ వారి జీతాలను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ వారికి అండగా నిలబడిందని అన్నారు. తద్వారా పారిశుద్ధ్య కార్మికులు కూడా అదే కృతజ్ఞత భావంతో మనస్ఫూర్తిగా పని చేస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావడం పట్ల ఈ సందర్భంగా సీఎం హర్షం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## కరోనా డేంజర్ బెల్స్ మోగుతోందా ?

రాష్ట్రంలో మళ్ళీ కరోనా వైరస్ కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా తూర్పుగోదావరి కృష్ణా జిల్లాల్లో కేసుల నమోదు ఎక్కువగా ఉన్నట్లు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు గుర్తించాయి. మామూలుగా అయితే కేసుల నముదు శాతం 5 కన్నా లోపుంటే సమస్య కంట్రోల్లో ఉన్నట్లే లెక్క. కానీ కొన్ని జిల్లాల్లో 5 శాతం దాటిపోతున్నాయి. తూర్పు కృష్ణా జిల్లాల్లో పాజిటివిటీ రేటు వరసగా 13.3 శాతం 10.75 శాతం నమోదయ్యాయి. పశ్చిమగోదావరి జిలాలో 9.37 శాతం విశాఖపట్నంలో 8.7 గుంటూరులో 6.4 శాతం పాజిటివిటి నమోదయ్యింది. అంటే పై జిల్లా ల్లో నమోదైన కేసుల శాతాన్ని చూసిన తర్వాత తూర్పుగోదావరి కృష్ణాజిల్లాల్లో పాజిటివిటీ రేటు చాలా ఎక్కువగా ఉన్నట్లు అర్ధమవుతోంది. ఇదే విధంగా ఎక్కువ పాజిటివిటి నమోదైన జిల్లాల సంఖ్య దేశంలో పెరుగుతోందని కేంద్రం స్పష్టంగా చెబుతోంది. కేసుల సంఖ్యను కంట్రోల్ చేయటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్రాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. మంగళవారం నాటికి కోవిడ్-19 పాజిటివ్ కేసులు రాష్ట్రంలో సుమారు 400 నమోదయ్యాయి. కేసులు ఎక్కువగా నమోదవుతున్న పై రెండు జిల్లాల్లోని ప్రాంతాల పైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. కేసుల నమోదుకు కారణాలను కనుక్కోవాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లు వైద్య ఆరోగ్య అధికారులను ఆదేశించింది. దాంతో ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయి పర్యటనలకు రెడీ అయ్యాయి. కరోనా వైరస్ కేసులపై పరిశోధన చేయటానికి గుంటూరులో ఇపుడున్న స్టేట్ వైరల్ రీసెర్చి అండ్ డయాగ్నస్టిక్స్ ల్యాబ్ ను ప్రభుత్వం హోల్ జినోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్ గా అప్ గ్రేడ్ చేయబోతోంది. ఇందుకు అవసరమైన సాంకేతక పరికరాలు టెస్టింగ్ కిట్ల కొనుగోలుకు అవసరమైన నిధులను కూడా కేటాయించింది. అయితే ఇలాంటి ల్యాబ్ అప్ గ్రేడేషన్ కు కేంద్రప్రభుత్వంలోని కొన్ని సంస్థల అనుమతి అవసరం. ఆ అనుమతిని సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇప్పటికే ఇలాంటి ల్యాబ్ ను విజయవాడ లో ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. గుంటూరు లో కూడా ఏర్పాటైతే రెండో ల్యాబ్ ఏర్పాటైనట్లు లెక్క. విజయవాడ ల్యాబ్ లో వారానికి 192 నమూనాల పరీక్షలు జరుగుతున్నాయి. గుంటూరు లో ఏర్పాటుకాబోయే ల్యాబు లో కూడా ఇదే సామర్థ్యం తో నమూనాలను పరీక్షించే అవకాశాలున్నాయి.

# కొత్వాల్‌గూడకు కొత్త సమస్య



శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలోని కొత్వాల్‌గూడ గ్రామానికి కొత్త సమస్య వచ్చిపడింది. దీంతో గ్రామస్థులు తాజా మాజీ సర్పంచ్‌లు, ప్రస్తుత కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే ప్రకాషగౌడ్‌ను కలిసి సమస్యను విన్నవించుకున్నారు. దీంతో ఎమ్మెల్యే ఆర్డీవోకు సమస్యను వివరించారు. దసరా తర్వాతసమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని చెప్పడంతో గ్రామస్తులు తేలికపడ్డారు. మంగళవారం గ్రామ మాజీ సర్పంచ్‌లు, రైతులు మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. కొత్వాల్‌గూడ గ్రామంలోని భూములు ఎనిమీ ప్రాపర్టీ అన్న విషయంపై కొన్ని సంవత్సరాలుగా వివాదం సాగుతోంది. ఈ సమస్యను గతంలో ఆ ఊరును అమ్ముకుంటాం.. అనుమతి ఇవ్వండి' అన్న శీర్షికతో వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో ప్రభుత్వం ఈ సమస్యకు తాత్కాలికంగా పరిష్కారం చూపింది. అయితే ఈ గ్రామంలోని భూములు ఎనిమీ ప్రాపర్టీ అని తేలిందని.. భూములు సాగు చేసుకుంటున్న రైతులు 30వ తేదీ లోగా తమ భూములకు సంబంధించిన వివరాలు ఆధారాలతో నిరూపించుకో వాలని కేంద్రప్రభుత్వం ఆధీనంలోని మంత్రిత్వశాఖ రెండు రోజుల క్రితం నోటీసులు జారీ చేసింది. అయితే, ఈ విషయం మీడియాకు తెలిస్తే వివాదం అవుతుందని కొందరు అధికారులు గ్రామస్థులను భయపెట్టడంతో ఈ విషయం బయటకు రాలేదు. అయుతే, తమ భూములు ఉంటాయో.. పోతాయోనన్న భయంలో కొందరు గ్రామస్థులున్నారు. దీంతో వారు తమ సమస్యను స్థానిక మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసగౌడ్, కృష్ణయ్యలతో కలిసి స్థానిక ఎమ్మెల్యే ప్రకాషగౌడ్‌కు విన్నవించారు. ఆయ న వెంటనే ఆర్టీవో చంద్రకళతో మాట్లాడి కొత్వాల్‌గూడ వివాదాన్ని పరిష్కారం చేయాలని కోరారు. దసరా సెలవులు అయిపోగానే ఈ సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని ఆర్డీవో చెప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. అయినా, స్థానికులు మాత్రం ఇంకా భయపడుతూనే ఉన్నారు.

నోటీసుల జారీతో అలజడి

కేంద్ర ప్రభుత్వ అధికారి సోమవారం కొత్వాల్‌గూడకు వచ్చి గ్రామ రైతులకు నోటీసులు ఇచ్చా రు. ఈ భూములు ఎనిమీ ప్రాపర్టీవి అని చెప్పడంతో గ్రామంలో అలజడి మొదలైంది. దీంతో ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించాం.

సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తు న్నాం.- శ్రీనివాసగౌడ్, కత్వాల్‌గూడ మాజీ సర్పంచ్

పొలాలు లాక్కుంటే ఊరుకోంఎన్నో ఏళ్లుగా ఇక్కడి రైతులు పొలాలను సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు అవి ఎనిమీ ప్రాపర్టీవి అని వాటిని లాక్కుంటే ఊరుకోం. వాటికోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమవుతాం. – కృష్ణయ్య, కొత్వాల్‌గూడ మాజీ సర్పంచ్

భూములు లాక్కుంటారని భయమవుతుందికొత్వాల్‌గూడకు ఏదో అవుతుందని.. ఇక్కడి రైతుల భూము లు ఎవరో లాక్కుంటారని ప్రచారం సాగుతోంది. దీంతో మాకు భయంగా ఉంది. మా పొలాల జోలికి ఎవరు వచ్చినా ఊరుకునేది లేదు. అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం.–ఈశ్వర్, రైతు, కొత్వాల్‌గూడఆత్మహత్య చేసుకుంటాం కొత్వాల్‌గూడలో తాము ఎప్పటినుంచో సాగు చేసుకుంటున్న భూములు విడిచిపొమ్మంటే ఎలా వెళతాం. వాటిని పోగొట్టుకోవాల్సి వస్తే పక్కనే ఉన్న హిమాయత్ సాగర్ (సౌడమ్మ చెర్వు)లో దూకి ఆత్మహత్య చేసుకుంటాం. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలి. – లక్ష్మి, గృహిణి

# డెంగీ దడ



నాగర్‌కర్నూల్ : డెంగీ దడ పుట్టిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వందల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో 10 రోజుల్లోనే 30 కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇలా కేసులు నమోదవుతుంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో అంతకు రెట్టింపు స్థాయిలో ఉంటున్నాయి. ప్రధానంగా శుభ్రత లోపించడం వల్ల జనం విష జ్వరాల బారిన పడుతున్నారు. అవగాహన కల్పించాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి చేయిదాటుతోంది. ఇప్పటికీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాల గురించి తెలియకపోవడం గమనార్హం. అక్టోబరు 11: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డెంగీ దడ పుట్టిస్తోంది. కేసులు నమోదవుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా కొన్ని రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు 48 డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నా ఆ లెక్కలను ప్రభుత్వ అధికార యంత్రాంగం పరిగణించడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసులనే గుర్తిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల నీరు నిల్వ ఉండి, దోమల బెడద పెరిగింది. అవి కుట్టడం వల్ల ప్రజలు డెంగీతో పాటు మలేరియా, చికున్ గున్యా వ్యాధుల బారిన పడుతున్నారు.

లోపించిన పారిశుధ్యం: నారాయణపేట జిల్లా కేంద్రంలోని పాత గంజి రోడ్డులో మురుగు నీరు నిలుస్తోంది. సివిల్ లైన్ రోడ్డు విస్తరణ పేరిట తవ్వకాలు జరపడంతో ఏర్పడ్డ గుంతలలో వర్షపు నీరు నిలిచి, మురికి కూపంలా మారాయి. అవి దోమలకు స్థావరాలుగా మారాయి. ఆర్డీవో కార్యాలయంతో పాటు పాత మునిసిపల్ కార్యాలయం ముందు వర్షపు నీరు నిలిచింది. పళ్ల బ్రిడ్జీ దగ్గర చెత్తాచెదారం వేస్తుండడంతో అక్కడ పందులు స్వైర విహారం చేస్తున్నాయి. డ్రై డేను అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్లపై నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల నివారణకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాగర్‌కర్నూల్‌లో 93 కేసులు

డెంగీ జ్వరాలతో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలు సతమతమవుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 93 కేసులు నమోదైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. 83 మంది జిల్లాలో ఉండగా, 10 మంది జీవనోపాధి కోసం జిల్లా నుంచి హైదరాబాద్ వెళ్లిన వారు అక్కడ డెంగీ బారిన పడ్డారు. వారి ఆధార్ కార్డు అడ్రస్ జిల్లాకు సంబంధించినది కావడంతో ఆ కేసులు జిల్లాలోనే నమోదు చేశారు. 83 కేసులలో కోడేరు, పెంట్లవెల్లి మండలాల్లో అధి కంగా 45 కేసులు నమోదయ్యాయి. డెంగీ మరణాలు సంభవించలేదని అధికారులు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇంకా ఎక్కువ మంది డెంగీ బారిన పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన చికిత్స లభించకపోవడంతో జనం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

నదీ పరివాహక ప్రాంత గ్రామాలపై పంజా

వనపర్తి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 95 డెంగీ కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 2017 నుంచి ఈ ఏడాది వరకు డెంగీ కేసులు పరిశీలిస్తే 2017లో 25 కేసులు నమోదయ్యాయి. 2018లో 24 కేసులు, 2019లో 95, 2020లో 74 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకే 95 కేసులు నమోదు కావడంతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. ఒక మలేరియా, ఒక చికున్‌గున్యా కేసులు కూడా నమోదయ్యాయి.

దోమ తెరలు పంపిణీ

డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులు ఎక్కువగా నదీ పరివాహక ప్రాంతాల్లో నమోదవుతున్నాయి. తిప్పడంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేందం పరిధిలోని గ్రామాల్లో, కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అమరచింత మండలాల్లో కేసులు అధిక సంఖ్యలో వస్తున్నాయి. వాటిని కట్టడి చేయడం కోసం మూలమల్ల, నందిమల్ల, జూరాల, మొట్లోంపల్లి, గుంటిపల్లి, బాలకిష్టాపూర్, పాన్‌గల్ పీహెచ్‌సీ పరిధిలోని అన్నారం, పెబ్కేరు మండలంలోని రాంపూరం గ్రామాలతో పాటు ఆత్మకూర్ పట్టణంలో 6,600 దోమ తెరలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉచితంగా పంపిణీ చేశారు. వీటితో పాటు నిల్వ నీటిలోని దోమ లార్వను అరికట్టడం కోసం పెద్దమందడి, మదనపూర్, పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 7,600 గంబూజియా చేపలను పెంచుతున్నారు.

గద్వాలలో 10 రోజుల్లో 30 కేసులు

జోగులాంబ గద్వాల జిల్లాలో గత కొన్ని రోజుల నుంచి ప్రజలు డెంగీ జ్వరంతో బాధపడుతున్నారు. కలుషిత నీరు, పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో దోమల స్వైర విహారంతో డెంగీ బారిన పడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 270 కేసులు నమోదయ్యాయి. జిల్లా ఆస్పత్రిలో ఈ నెల 10 రోజుల్లోనే 30 డెంగీ కేసులు నమోదైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్ తెలిపారు. దీంతో పాటు వైరల్ జ్వరాల కేసులు 70–80 వచ్చాయని చెప్పారు. ఇందులో కొన్ని డెంగీ కేసులు కాకున్నా కూడా ప్లెట్‌లెట్స్ తగ్గిపోతున్నాయని అన్నారు. జిల్లా ఆస్పత్రిలోనే రోజూ దాదాపుగా 4–5 డెంగీ కేసులు, 7–8 వైరల్ జ్వరాలు నమోదు అవుతున్నాయని చెప్పారు. ప్రవేట్ ఆస్పత్రుల్లో రోజూ దాదాపు 20 వరకు డెంగీ కేసులు నమోదవుతున్నట్లు సమాచారం. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు, కర్నూల్, హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని డాక్టర్లు చెబుతున్నారు.

జిల్లా కేంద్రంలో పారిశుధ్య పనులు నిల్: జోగుళాంబ గద్వాల పేరుకే జిల్లా కేంద్రం అని చెప్పుకోవాల్సి వస్తోంది. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. బస్టాండ్‌తో పాటు పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. పలు కాలనీల్లో పందులు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల నివారణ చర్యలు లోపించడంతోనే డెంగీ కేసులు పెరుగుతున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. డెంగీ ప్రధానంగా దోమల వల్లే వస్తుందని, ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ చెప్పారు. దోమల నివారణకు మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు.

# వెలగని దీపాలు

కరీంనగర్ : బతుకమ్మ.. దసరా పండుగల సందర్భంగా వీధుల్లో చీకటి ఉండకుండా, బతుకమ్మ ఆడుకునే మహిళలకు సౌకర్యంగా ఉండేలా నగరపాలక సంస్థ ఏటా ప్రత్యేక వీధిదీపాలు ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలుస్తోంది. ఏడాది కూడా 24 పనులకు టెండర్లు పిలిచి పనులు అప్పగించారు. నగరంలోని 60 డివిజన్లలో ఎంపిక చేసిన స్థలాల్లో, అదేవిధంగా బతుకమ్మ నిమజ్జనం చేసే చెరువులు, కెనాల్స్ దగ్గర ప్రత్యేక వీధిలైట్లు బిగిస్తారు. నగరమంతా కలిపి సుమారు 12,619పైగా లైట్లు బిగించినట్లు అధికారులు చెబుతున్నారు. ఫ్లడ్ లైట్ల కోసం పెద్ద టవర్లు, మినీ టవర్లు ఏర్పాటు చేశారు. అత్యవసర సమయాల్లో జనరేటర్లు కూడా ఆయా ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచారు.

గంపగుత్తగా బిగింపు

నగరంలోని ముఖ్య కూడళ్ల దగ్గర మహిళలు బతుకమ్మ ఆడుకునే పాయింట్‌లో 1000 వాట్స్ గల హాలోజన్ లైట్లు సుమారు 6,335



బిగించారు. ఇందులో డివిజన్లలో మూడు వేల వీధిదీపాలు వెలిగించారు. ఇక్కడి వరకు బాగానే ఉండగా హాలోజన్ లైట్లు ఎలాంటి టెస్టింగ్ లేకుండా గంపగుత్తగా సంబంధిత గుత్తేదారులు తీసుకొచ్చి నగరపాలిక వీధిదీపాల కార్మికులకు అప్పగించారు. ఎన్ని లైట్లు ఉన్నాయో లెక్క లేదు. ఎన్ని వెలుగుతాయో, ఎన్ని రావో తెలియకుండానే ఆ కార్మికులు మంగళవారం, బుధవారం ఉదయం కల్లా లైట్లు తీసుకెళ్లి డివిజన్ కేంద్రాల్లోని బతుకమ్మ పాయింట్స్‌లో మూడు నుంచి నాలుగు లైట్లు బిగించారు. ఒకటెండ్రు చోట్ల సమస్యలు వచ్చినట్లు చెబుతున్న ఇంజినీరింగ్ అధికారులు.. మార్చకుండా వదిలేశారు.

# ఆరుతడి పంటలకు డిమాండ్

సూర్యాపేట : ఉమ్మడి జిల్లాలో ఆరుతడి పంటలకు డిమాండ్ పెరిగింది. ఆరుతడి పంటల విస్తీర్ణం తక్కువగా ఉండటం ధరల పెరుగుదలకు కారణమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఆరుతడి పంటల్లో పెసరకు కొంతకాలంగా భారీగా ధర పలుకుతోంది. ఉమ్మడి జిల్లాలో పెసరకు రికార్డుస్థాయి ధర పలుకుతోంది. తక్కువ విస్తీర్ణంలో పెసర సాగు కావడం, దానికితోడు పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు అధికంగా కురవడంతో దిగుబడి తగ్గింది. చేతికి వచ్చిన కొద్ది పంటను మార్కెట్లకు తీసుకెళ్తే ఎక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో పెసలకు క్వింటాకు రూ. 7,589 రికార్డుస్థాయి ధర పలికింది. కొద్దిరోజులుగా పెసరకు వ్యాపారులు ఎక్కువ ధర చెల్లిస్తున్నారు. పేట మార్కెట్‌లో ఈ–నామ్ విధానం ద్వారా సీక్రెట్ టెండర్ నడుస్తోంది. దీంతో ఒక ఖరీదుదారుడు ఎంతమేర ధర నిర్ణయిస్తున్నారనే విషయం మరో ఖరీదుదారుడికి తెలిసే అవకాశం ఉండదు. దీంతో పోటీతత్వం పెరిగి ధరలు పెరిగాయని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో పెసలకు మద్దతు ధర రూ. 7,459 ఉండగా, కనిష్ఠ ధర రూ. 3,129, మోడల్ ధర రూ. 5,359గా ఉంది.

పంటల సాగు తగ్గడంతో..

పెసర, కంది, వేరుశనగ పంటలు సాగు చేసిన రైతులకు వ్యవసాయ మార్కెట్లలో అధిక ధరలు వస్తుండటంతో వరి సాగు చేసిన రైతులు నిట్టూరుస్తున్నారు. ఎక్కువ మంది రైతులు వరి సాగుకు మొగ్గుచూపడంతో ఉమ్మడి జిల్లాలో అపరాల సాగు తగ్గింది. ఈ ఏడాది సూర్యాపేట జిల్లాలో పెసర 12,867 ఎకరాలు సాగు కావాల్సి ఉండగా, 4,394 ఎకరాల్లో మాత్రమే సాగైంది. కంది 24,257 ఎకరాలకు, 9,229 ఎకరాల్లో, వేరుశనగను 3,331ఎకరాలకు కేవలం 1009 ఎకరాల్లో మాత్రమే సాగైంది. యాదాద్రి, నల్లగొండ జిల్లాలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. మూడేళ్లుగా, ఉమ్మడి జిల్లాలో అపరాల సాగు తగ్గుతూ వస్తోంది. సాగునీరు సమృద్ధిగా లభిస్తుండటంతో అపరాలకు బదులు రైతులు వరివైపు మొగ్గుచూపుతున్నారు. వరికి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు సాగుచేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నా రైతులు మాత్రం వరిపైనే ఆసక్తి చూపారు. కేవలం కొద్దిమంది రైతులు మాత్రమే ఆరుతడి పంటలు సాగు చేయగా, వాటికి మద్దతు ధరకు మించి వ్యాపారులు చెల్లిస్తున్నారు. వరి పంటకు మాత్రం మార్కెట్లలో మద్దతు ధరకంటే తక్కువ లభిస్తోంది. తాజా పరిస్థితులను గమనించి రైతులు యాసంగిలో ఆరుతడి పంటలు సాగుచేయాలని, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కందులకు మద్దతు ధర క్వింటాకు రూ. 6,300 ఉండగా, వ్యాపారులు రూ. 6,500 నుంచి రూ. 7,000 వరకు చెల్లిస్తున్నారు. పెసరకు మద్దతు ధర రూ. 7,275 ఉండగా, రూ. 7,000 నుంచి రూ. 7,400 వరకు ధర పలుకుతోంది. వేరుశనగకు మద్దతు ధర రూ. 5,550 ఉండగా, రూ. 6,000 నుంచి రూ. 6,500 వరకు వ్యాపారులు చెల్లిస్తున్నారు.

ఈ–నామ్‌తోనే అధిక ధరలు : ఎండి. ఫసియుద్దీన్, సూర్యాపేట మార్కెట్ కార్యదర్శి

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ఈ–నావ్ విధానం అమలవుతుండటంతో అపరాలకు వ్యాపారులు ఎక్కువ ధర చెల్లిస్తున్నారు. ఆన్‌లైన్ టెండర్ విధానంలో ఒక ఖరీదుదారుడు ఎంత ధర నిర్ణయించాడనే విషయం మరో ఖరీదుదారుడికి తెలియదు. అపరాల దిగుబడి తక్కువ ఉండటం వల్ల వ్యాపారుల మధ్య పోటీపెరగడంతో ఎక్కువ ధరలు పలుకుతున్నాయి.

# ఆయిల్‌పాం సాగుపై అన్నదాత ఆసక్తి

ముస్తాబాద్ : మెట్ట ప్రాంతమైన జిల్లాలో మొన్నటి వరకు పంటల సాగు కష్టంగా ఉండేది. సాగునీటి వనరులు లేక భూములు బీడుగా ఉండేవి. ప్రస్తుతం జల వనరులు పెరగడం, పంటలకు నీరు పుష్కలంగా ఉండటంతో వాణిజ్య పంటలను సైతం సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై అధికారులు అవగాహన కల్పించడం, ముఖ్యంగా జిల్లాలో ఆయిల్‌పాం సాగుపై ఉన్న అవకాశాలపై ఉద్యానవనశాఖ అధికారులు కర్షకులకు అవగాహన కల్పించారు. దీంతో రైతులు జిల్లాలో ఈ తోటలను సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఫలితంగా గణనీయంగా సాగు విస్తీర్ణం పెరిగింది.

ఆయిల్‌పాంకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం ఈ పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించడంతో పాటు అవసరమైన డ్రిప్ పరికరాలు, మొక్కలను రాయితీపై ఇస్తుంది. వన్యప్రాణులు, ముఖ్యంగా కోతల బెడద లేకపోవడం, చీడపీడల సమస్య తక్కువగా ఉండటంతో పలువురు ఈ తోటల సాగుపై దృష్టి సారించారు. మరోవైపు జిల్లాలో ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచే దిశగా అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ముందుకు వచ్చిన వారితోపాటు కొత్త వారి వివరాలు నమోదు చేస్తున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో అత్యధికంగా ముస్తాబాద్ మండలంలో ఆయిల్‌పాం సాగు చేస్తున్నారు. ముస్తాబాద్ మండలంలో 56 మంది రైతులు 283.20 ఎకరాల్లో సాగు చేశారు. బోయినపల్లిలో



58 మంది 159.12 ఎకరాలు, తంగళ్లపల్లిలో 46 మంది 135.60, కోనరావుపేట మండలంలో 32 మంది 99.40, ఇల్లంతకుంటలో 28 మంది 84.58, గంభీరావుపేటలో 23 మంది 74.28, వేములవాడ గ్రామీణ మండలంలో 16 మంది 37.50, ఎల్లారెడ్డిపేటలో ఏడుగురు 31.90, వేములవాడ అర్బన్‌లో ఆరుగురు 21.32, వీర్నపల్లిలో 9 మంది 68, సిరిసిల్లలో ఏడుగురు 18.12, చందుర్తిలో ముగ్గురు 8 ఎకరాల్లో చేయగా, రుద్రంగిలో ఒక రైతు రెండు ఎకరాల్లో వేశారు. మొన్నటి వరకు ఆయిల్‌పాం సాగు అంటే తెలియని జిల్లాలో నేడు అన్ని మండలాల్లో ఈ తోటలను పెంచుతుండటం గమనార్హం.

మరో యాభై ఎకరాల్లో...

ఇప్పటికే తొమ్మిది ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలను సాగు చేశాను. మరో యాభై ఎకరాల్లో సాగు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. నాతోపాటు నాకు తెలిసిన రైతులకు తోటలు పెంచాలని అవగాహన కల్పిస్తున్నాను. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుమతులు సాధించుకోవచ్చని వివరిస్తున్నాను.

జనగామ శరత్‌రావు, రైతు, ఎంపీపీ

దరఖాస్తు చేసుకోవాలి

వేసవి కాలం దృష్ట్యా ఆయిల్‌పాం తోటలను వడగాలుల నుంచి రక్షించుకోవడానికి మొక్కకు రెండు అడుగుల దూరంలో జనుము విత్తనాలను చుట్టూ నాటుకోవాలి. మొక్క పెరిగి మే, జూన్ వరకు వడగాలుల నుంచి రక్షణ కల్పిస్తుంది. జనుము విత్తనాలు నాటకపోతే ఎండవేడికి నీరు తొందరగా ఆవిరయ్యే అవకాశముంటుంది. చెట్టు పెరిగిన తర్వాత కోసి చెట్టు చుట్టూ వేసినట్లయితే ఎరువులా పని చేస్తుంది. కొమ్మ పురుగు నుంచి రక్షణ పొందడానికి ఎకరానికి రెండు చొప్పున లింగారపు బుట్టలను ఏర్పాటు చేయాలి. తోటలు సాగు చేసిన రైతులకు ఎకరానికి ఎరువుల ఖర్చుల కోసం నాలుగు సంవత్సరాల వరకు రూ. 4,200 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలి.స్రవంతి, ఉద్యానవన క్లస్టర్ అధికారి

# పాఠశాలల్లో పీఎంశ్రీ అమలుకు అడుగులు




జనగామ : ప్రభుత్వ పాఠశాలల్లో మరింత నాణ్యమైన విద్యనందిస్తూ ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం అమలుకు అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలలకు ఐదేళ్ల పాటు సుమారు రూ.కోటి ఆర్థిక సాయమందించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, పెరటి తోటలు, ఆధునిక సాంకేతికత తదితరాలను సమకూరుస్తారు. మొదట అన్ని జిల్లాల నుంచి అర్హత కలిగిన పాఠశాలల వివరాలు తెప్పించుకున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా ఎంపికైన పాఠశాలల జాబితాను వెల్లడించింది. ఇందులో ప్రమాణాలను సంతృప్తి పరిచిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో 56 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించారు. మొదటి దశలో పాఠశాల గుర్తింపు, రెండో దశలో లక్ష్యాల నిర్ధారణ, చర్చ, మూడో దశలో వాటి సాకారానికి చర్యలు తీసుకుంటారు.

మిగతా బడులకు మార్గదర్శకంగా..

పీఎంశ్రీ పథకంలో గుర్తించిన పాఠశాలలు మిగతా బడులకు మార్గదర్శకంగా పనిచేస్తాయి. విభిన్న మనస్తత్వాలు కలిగిన బాలబాలికలకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ఆధునిక సాంకేతిక వనరులు కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉదారంగా నిధులు అందిస్తాయి. ఆయా పాఠశాలల పరిధిలోని ఇతర ప్రాంతాల పాఠశాలలకు చుక్కానిలా వ్యవహరిస్తాయి. ఎంపికైన పాఠశాలల అభివృద్ధికి 2026 వరకు కోటి రూపాయల వరకు ఖర్చు చేస్తారు.

ఇలా చేస్తారు..ఈ పథకం అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా 543 పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఆటలు, సాంస్కృతిక ఎదుగుదల, నాణ్యమైన విద్య, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, విద్యార్థికి మానసిక స్వేచ్ఛ కల్పించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం, దేశం గురించి సంపూర్ణ అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల్లో భాషాపరమైన అవరోధాలను అధిగమించేందుకు అవసరమైన సాంకేతిక సొబగులను అందుబాటులోకి తెస్తారు. సౌర విద్యుత్తు సేవలు, పాఠశాలల్లో ఎల్‌ఈడీ విద్యుత్తు దీపాల అమరిక, పోషకాహార తోటల పెంపకం, ప్లాస్టిక్ నిర్మూలన, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, బొమ్మలతో బోధన తదితర పనులు చేయడంతో పాటు విద్యార్థులు ఏం నేర్చుకున్నారనే విషయాన్ని మదింపు చేస్తారు. పాఠశాల విద్య అనంతరం విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన వచ్చేందుకు ఈ పాఠశాలలు కృషి చేస్తాయి. ప్రతి పాఠశాలలో నాణ్యత మదింపు వ్యవస్థను అభివృద్ధి చేస్తారు. వీటి నిర్వహణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను సమకూరుస్తాయి.

ఎంపిక ఇలా.. ప్రాథమికంగా జిల్లా స్థాయిలో పాఠశాలలను గుర్తించారు. నిబంధనల మేరకు అర్హతలున్న పాఠశాలల వివరాలు, విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల సంఖ్య, వనరుల కల్పనకు తగిన అవకాశాలను పరిశీలించారు. జనగామ జిల్లాలో 112 పాఠశాలలను గుర్తించి ప్రభుత్వానికి వివరాలు అందించారు. 62 ప్రమాణాలకు సంబంధించిన 130 మార్కులను కేటాయించారు. అత్యధిక మార్కులు సాధించిన పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోనున్నాయి. మరింత సమాజ మన్ననలు పొంది ప్రభుత్వ పాఠశాలలు పూర్వ వైభవం పొందే అవకాశాలున్నాయి.

ప్రభుత్వానికి వివరాలు పంపించాం

పీఎంశ్రీ పథకం అమలుకు నాలుగు నెలల క్రితం ప్రభుత్వం.. ప్రమాణాలున్న పాఠశాలల వివరాలు అడిగింది. జనగామ జిల్లాలో అమలుకు అర్హత కలిగిన పాఠశాలల వివరాలు పంపించాం. జిల్లాలో తాజాగా పది పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటితో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు వెలుగొందు తాయి.కె. రాము, జిల్లా విద్యాధికారి, జనగామ జిల్లా

# కల్లాల్లో ధాన్యం.. కళ్లలో దైన్యం

ఇబ్రహీంపట్నం :యాసంగి పంటలు వేసిన అన్నదాతలకు ఆది నుంచి ఇబ్బందులే ఎదురవుతున్నాయి. చీడపీడలు, సాగునీటి ఇబ్బందులు ఇవన్నీ దాటి పంట చేతికందుతుందన్న సమయంలో అకాల వర్షాలు నిండాముంచాయి. జిల్లాలో ఈ ఏడాది వరిపంటను అధిక సంఖ్యలో సాగుచేశారు. పంట కోత దశలో వడగళ్లు, అకాల వర్షాలతో వడ్లన్నీ పొలంలోనే రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి, కొట్టుకుపోయింది. దీంతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితిపై పరిశీలన కథనం..

ప్రారంభం కాని కొనుగోళ్లు

మండలంలోని 17 గ్రామాల్లో యాసంగిలో 12,305 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. రైతులు పంట కోయడంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి, ఆరబెడుతున్నారు. ధాన్యం సేకరణకు ఇప్పటికి 15 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా, వేములకుర్తి, కేశాపూర్ గ్రామాల్లో ప్రారంభం కావాల్సి ఉంది. కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తేమ శాతం రాకపోవడంతో పాటు ధాన్యంలో తప్పతాలును శుభ్రం చేయకపోవడంతో తూకాన్ని ప్రారంభించలేదు. మండలంలో సుమారు 2.70 లక్షల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

280 క్వింటాళ్లు మాత్రమే..

మండలంలో 16,800 ఎకరాలలో వరి సాగు చేయగా 3.50 లక్షల క్వింటాళ్ల దిగుబడిని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మండలంలోని 15 గ్రామాల్లో ఐకేపీ ద్వారా 11, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 17 కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 28 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వారం రోజులుగా వాతవారణంలో మార్పు కారణంగా ధాన్యంలో తేమ శాతం రాకపోవడంతో కొనుగోలు చేపట్టడం లేదు. ధర్మారం గ్రామంలో 280 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైసుమిల్లుకు తరలించారు. వాతావరణంలో మార్పుతో కొనుగోళు మందకొడిగా సాగుతున్నాయి.

సేకరణ మొదలే కాలేదు..



జగిత్యాల గ్రామీణ, అర్బన్ మండలంలో వరి కోతలు పూర్తి దశకు చేరి ధాన్యం కల్లాల్లోకి చేరింది. మండలంలో 40 వేల ఎకరాల్లో వరి సాగు కాగా లక్ష క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. ధాన్యం సేకరణకు మండలంలో 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా 15 మాత్రమే ప్రారంభించారు. కొనుగోళు ప్రారంభం కాకపోవటంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో తేమశాతం ఇబ్బందిగా మారింది. జగిత్యాల

ఐదు కేంద్రాల్లోనే తూకం

మండలంలో సుమారు 21,236 ఎకరాల్లో వరి సాగు చేయగా, సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ధాన్యం సేకరణకు ఐకేపీ సహకార సంఘాల ఆధ్వర్యంలో 23 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు 20 కేంద్రాలు ప్రారంభించారు. కొన్ని కేంద్రాల్లో గన్నీ సంచులు లేవు. ఐదు కేంద్రాల్లో మాత్రమే 882.80 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది. ధాన్యం పోసి వారం గడుస్తున్నా కొనుగోలు చేయకపోవడంతో ఎండ ఉన్న సమయంలో ఆరబోయడం, వర్షం రాగానే కుప్పగా చేయాల్సి రావడంతో కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నారు.

వసతుల కొరత

మండలంలో 17 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేయగా సుమారు 3.75 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ ఇటీవల కురిసిన వడగళ్ల వర్షాలకు మండలంలో సుమారు 3500 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో కొంతమేర ధాన్యం దిగుబడి తగ్గే అవకాశం ఉంది. సెర్ప్ ద్వారా పది కేంద్రాలు, కొడిమ్యాల, పూడూర్, తిర్మలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇటీవలే ప్రారంభించినా ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. కేంద్రాల్లో వసతుల కొరతతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.

స్థలాలు లేక ఇబ్బందులు

మండలంలో 18 గ్రామాలు ఉండగా 23 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నారు. మండలంలో 11,779 ఎకరాల్లో వరిసాగు చేయగా, దాదాపుగా 2.35 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తోందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. సహకార సంఘాల ద్వారా 13, డీసీఎంఎస్ ద్వారా ఒకటి, ఐకేపీ ద్వారా తొమ్మిది కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ పోతారం, బట్టపల్లి, సారంగాపూర్‌లో మాత్రమే సేకరణ ప్రారంభిం చారు. బీర్‌పూర్ మండలంలో 15 గ్రామాలలో 7,369 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేయగా, 1.47 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. సహకార సంఘాల ద్వారా తొమ్మిది, ఐకేపీ ద్వారా అయిదు కేంద్రాల ద్వారా సేకరణ చేపడుతున్నారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోనే పల్లె క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం మరింత అవస్థలు తెచ్చి పెడుతుంది.

# రామప్ప తూర్పు రహదారికి మహర్దశ!




జనగామ : వరదలకు కొట్టుకుపోయి మూతపడ్డ రామప్ప ఆలయ తూర్పు దారికి మోక్షం లభించింది. ఇంతకాలం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న భక్తులు, సందర్శకులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు వినిపించింది. తూర్పు రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించి సుందరీకరించేందుకు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం టెండర్లు కూడా పూర్తి చేసుకుని వారం రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. యునెస్కో నియమాలకు అనుగుణంగా రోడ్డు నిర్మించేందుకు పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల సహకారంతో ఆకృతులు సిద్ధం చేశారు.

నాలుగు వరుసలు.. రెండు మినీ వంతెనలు

కేటాయించిన నిధులు: రూ.3 కోట్లు

ఎక్కడ నుంచి ఎక్కడికి: పాలంపేట ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఆలయ తూర్పు గేటు వరకు

రోడ్డు పొడవు: 810 మీటర్లు

వెడల్పు: 20 మీటర్లు

డివైడర్: 2 మీటర్లు

కల్వర్టు మినీ బ్రిడ్జిలు: రెండు

పాలంపేట ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఆలయ తూర్పు గేటు వరకు 810 మీటర్ల పొడవునా నిర్మించే నాలుగు వరుసల రోడ్డుతో రామప్ప పరిసరాల రూపురేఖలు మారనున్నాయి. గతంలో నిర్మించిన సెంట్రల్ లైటింగ్‌తో కూడిన రెండు వరుసల సీసీ రోడ్డు రామప్ప సరస్సు మత్తడి ప్రవాహ ఉద్ధృతికి కొట్టుకుపోవడంతో రూ.82 లక్షల ప్రజాధనం నీటిపాలైంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని నీటిపారుదల, పంచాయతీరాజ్‌శాఖలు సంయుక్తంగా సర్వే చేసి మత్తడి నీళ్లు సాఫీగా వెళ్లే విధంగా రెండు మినీ బ్రిడ్జి కల్వర్టులను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. దీంతో పాటు నాలుగు అడుగుల డివైడర్‌కు రెండు వైపులా 7 మీటర్ల వెడల్పుతో రోడ్లు.. వాటికి రెండు మీటర్లలో పాత్‌వేలు, సైడ్‌బర్మ్‌తో నిర్మించనున్నారు. విద్యుత్తు వెలుగులను పూయించడం కోసం సెంట్రల్ లైటింగ్ లేదా ఇరువైపులా దీపాలు ఏర్పాటు చేయాలా అనేది అప్పటికప్పుడు నిర్ణయిస్తామని అధికారులు పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు చెబుతున్నారు.

భూసేకరణే సమస్య!పనులు మొదలు పెట్టేందుకు గుత్తేదారు సిద్ధంగా ఉన్నా... తూర్పు రోడ్డుకు పక్కనే కొంత మేర పట్టా భూములు ఉన్నాయని స్థానికుల నుంచి అభ్యంతరం వ్యక్తమవుతోంది. దానిని పరిష్కరించడం కోసం సంబంధిత శాఖల అధికారులు రెవెన్యూ శాఖ అధికారులను కలిసినట్లు తెలుస్తోంది. రెవెన్యూశాఖ సర్వే చేపట్టి భూమిని కేటాయించగానే పనులు ప్రారంభించాలని చూస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే హద్దులు ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరుగుతుందని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు.

# అత్యవసర అభివృద్ధి పనులకు బ్రేక్

జగిత్యాల : జనవరి నెలలో అత్యవసరంగా ముస్లిం శ్మశానవాటికలో సీసీ రోడ్డు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసేందుకు రూ.15 లక్షలతో టెండర్లు పిలిచారు. మూడు నెలలు కావస్తున్నా టెండర్లు ఓపెన్ చేయకుండా వదిలేశారు. రంజాన్‌లోపు పనులు పూర్తి కావాల్సి ఉండగా.. ఖరారు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.గత నెల 27న ఓ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేసేందుకు టెండర్లు పిలవగా అదే నెల 29న ఓపెన్ చేసి చకచకా ఆ పనులకు ఒప్పందం చేసి అప్పగించారు. ప్రజలు ఇబ్బందులు పడుతుండగా నేడో, రేపో పనులు ప్రారంభించే అవకాశముంది. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 60వ డివిజన్లలో అభివృద్ధి పనులు చేసేందుకు ఉత్సాహం చూపుతుండగా.. టెండర్లు నిర్వహించడం మొదలుకొని వాటిని అప్పగించడం వరకు జాప్యం తప్పడం లేదు. టెండర్లలో గుత్తేదారులు అనుసరిస్తున్న ధోరణి ఓ రకంగా ఉంటుండగా.. అప్పగించేందుకు తర్జన, భర్జన వహిస్తుండటం మరింత అనుమానాలకు తావిస్తోంది. ప్రతి పనికి ఈ-ప్రొక్యూర్‌మెంట్‌తోనే టెండర్లు నిర్వహిస్తుండగా కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించి అనుకూలంగా పనులు దక్కకపోతే నిలిపి వేసేందుకు కూడా వెనుకాడటం లేదు.

రూ.50 కోట్లతో...నగరంలోని పలు వీధులలో సీసీ రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి పైపులైన్లు, హైమాస్ట్ లైట్ల బిగింపు వంటి పనులు చేసేందుకు సాధారణ, ఇతర రకాల నిధులతో సుమారు రూ.50 కోట్లతో 415 పనులకు మూడు నెలలుగా టెండర్లు పిలుస్తున్నారు. ఇందులో 270 పనులకు గుత్తేదారులు ఆసక్తి చూపించగా, మిగతా 170 పనులకు రీకాల్ చేస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా మరో వంద పనులకు కూడా టెండర్లు పిలవగా వీటిని ఖరారు చేయాల్సి ఉన్నట్లు సమాచారం.

ప్రాధాన్యం లేకుండా తెరవడం

నిర్వహించిన తేదీల ప్రకారం వచ్చిన టెండర్లు తెరవకుండా తర్వాత పెట్టినవి తెరుస్తున్నారు. అత్యవసరం పేరిట ఎప్పుడో నిర్వహించిన టెండర్లు అలాగే మూలనపడి ఉండగా.. వారం, 15 రోజుల్లో పూర్తయిన వాటిని పరిశీలిస్తూ ఆ పనులను అప్పగిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అధికారులు తమపై ఒత్తిడి తెచ్చే వాటిని తెరుస్తున్నారని, మిగతా వాటిని అలాగే నెలల తరబడి పెండింగ్ పెడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ప్రాధాన్యం ప్రకారం టెండర్లు తెరిచి గుత్తేదారులకు అప్పగిస్తే ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యే వీలుంది.

అనుకూలంగా రాకపోతే నిలిపివేత?పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లు అనుకూలమైన గుత్తేదారులకు రాకపోతే నిలిపి వేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఆన్‌లైన్ టెండర్లు కావడంతో రాష్ట్రంలోని ఎక్కడి నుంచైనా గుత్తేదారులు పాల్గొనే అవకాశముంటుంది. ఎక్కువ శాతం ఏ మున్సిపాలిటీ పరిధిలోని గుత్తేదారులు ఆ ప్రాంతంలోనే పనులు చేసేందుకు మొగ్గు చూపిస్తుండటంతో ఇందులో కూడా పోటీ పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినా పోటీ పడితే ఆ టెండర్లు ఓపెన్ చేసి అప్పగించేందుకు నెలల సమయం తీసుకోవడం సాధారణంగా మారిందనే ఆరోపణలున్నాయి.

# గరిష్ఠ స్థాయికి విద్యుత్తు డిమాండ్

జగిత్యాల : కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో విద్యుత్తు డిమాండ్ గరిష్ఠాన్ని దాటుతోంది. రాష్ట్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా తరువాత మన జిల్లా రెండో స్థానంలో ఉంది. 2014-15 నుంచి 2022-23 మధ్య డిమాండ్‌ను పరిశీలిస్తే 149 శాతం పెరిగినట్లుగా విద్యుత్తు సంస్థ గుర్తించింది. ఏటా కరెంటు వినియోగం అధికమవుతోంది. ఇందుకు వ్యవసాయ సర్వీసులు పెరగడం, వాతావరణ మార్పులు కారణాలుగా తేలింది. పూర్తి వివరాలతో కథనం.పెరిగిన వ్యవసాయ కనెక్షన్లు..ఉమ్మడి జిల్లాలో ఏటా వ్యవసాయ కనెక్షన్లు పెరుగుతున్నాయి. సమృద్ధిగా భూగర్భ జలాలు అందుబాటులోకి రావడంతో సాగు విస్తీర్ణం రెట్టింపవుతోంది. దీనికి అనుగుణంగా మోటారు కనెక్షన్లు పెరుగుతున్నాయి. కరెంటు వినియోగం అదే బాటలో ఉంటుంది. 2014-15తో పోల్చితే ఒక్కో నూతన జిల్లాలో 5 వేల నుంచి 10 వేల వరకు సర్వీసులు అదనంగా వచ్చాయి. ఇదే సమయంలో పీక్ అవర్స్‌లో కరెంటు డిమాండ్ తారా స్థాయి దాటుతోంది. 2014-15లో ఉమ్మడి జిల్లాలో 2,72,509 వ్యవసాయ సర్వీసులు ఉంటే ప్రస్తుతం 3,05,701కు చేరింది.వాతావరణ మార్పులు..వాతావరణ మార్పులు విద్యుత్తు వినియోగం పెరగడానికి ప్రధాన కారణం. డిమాండ్ పతాక స్థాయికి చేరుకోవడానికి, ఒకసారిగా పాతాళానికి పడిపోవడానికి ఇవి కారణమవుతాయి. ఏప్రిల్ మాసం ప్రారంభంలో కరెంటు వినియోగం.. డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. ఈనెల రోజు వారి కోటా కింద 10.66 మిలియన్ యూనిట్లుగా నిర్దేశించారు. ఒకటో తేదీన 17.585 మిలియన్ యూనిట్ల వినియోగం కాగా ఇదే రోజు పీక్ అవర్స్‌లో (మధ్యాహ్నం 3 గంటలకు) 927.42 మెగా వాట్లుగా నమోదైంది. ఈ లెక్కన వ్యవసాయ, గృహ వినియోగం అనూహ్యంగా పెరిగింది. మధ్యాహ్నం పూట గృహ వినియోగదారులు వేసవి తాపం నుంచి తట్టుకోవడానికి శీతలోపకరణాలు వాడుతున్నారు. ఇదే సమయంలో వ్యవసాయ మోటార్లు తిరుగుతుండటంతో డిమాండ్ తారా స్థాయికి చేరుతుంది. గత వారం నుంచి పరిస్థితి మారింది. అకాల వర్షాలు, వడగళ్లతో వాతావరణం చల్లగా మారిపోయింది. బుధవారం జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు వినియోగం 4.412 మిలియన్ యూనిట్లకు పడిపోయింది.

# సమున్నత లక్ష్యం.. సేవలు దూరం

పెద్దపల్లి: ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం రానురానూ ఖరీదైన వ్యవహారంగా మారడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరం వచ్చిందని వెళ్లినా పరీక్షల పేరిట రూ.వేలల్లో గుంజుతుండటంతో ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో మారుమూల ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసింది. సమున్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తించడానికి వైద్యులు ముందుకు రావడం లేదు.

మంథనిలో సమస్య తీవ్రంప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు దూరంగా, మారుమూల గ్రామాల్లో ఉండే ఉప కేంద్రాలను అన్ని హంగులతో తీర్చిదిద్దాలన్న ఆశయంతో జిల్లాలో కొత్తగా 66 పల్లె దవాఖానాలు మంజూరు చేశారు. మొత్తం 104 ఆరోగ్య ఉప కేంద్రాలుండగా వాటిలో 66 చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఒక్క మంథని మండలంలోనే 10 పల్లె దవాఖానాలను ప్రారంభించారు. వీటిలో వైద్యుల నియామకానికి 2021 జనవరి నుంచి ఇప్పటివరకు పలుమార్లు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసినా పట్టుమని పది రోజులు కూడా ఉండటం లేదు. కొందరు స్వచ్ఛందంగా రాజీనామా చేసి వెళ్లిపోతున్నారు. వీరిలో ఎక్కువ మందికి పీజీ సీటు రావడం, ఇతర దేశాలకు వెళ్లడం, నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతుండటంతో వైద్యుడి పోస్టులు ఖాళీ అవుతున్నాయి. దీంతో పరిస్థితి మొదటికొస్తోంది. మంథని మండలంలోని ఆరెంద, అడవిసోమన్‌పల్లి, ఖానాపూర్, మచ్చుపేట ప్రాంతాల్లో పల్లె దవాఖానాలకు ఎంపికైన వైద్యులు తరచూ విధులకు గైర్హాజరవుతుండటం, అనంతరం పూర్తి స్థాయిలో మానేస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యానికి విఘాతం కలుగుతోంది. వైద్యులు లేకపోవడంతో స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది చికిత్స అందించాల్సిన పరిస్థితి ఉండటంతో క్రమంగా ప్రజలకు నమ్మకం తగ్గుతోంది.ప్రైవేటు వైపే మొగ్గు గతంలో ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్యులుండేవారు కాదు. మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి కొన్నింటిని ప్రభుత్వం హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా తీర్చిదిద్దింది. ఇందులో భాగంగా స్టాఫ్‌నర్సులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారితో సేవలు అందించేవారు. ఆ తర్వాత మిడ్ లెవల్ హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలను పల్లె దవాఖానాలుగా ఉన్నతీకరిస్తూ, వైద్యులకు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌పీ)గా హోదానిస్తూ వారి నియామకానికి శ్రీకారం చుట్టారు. పట్టణాలకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉండటం, జీతభత్యాలు తక్కువగా ఉండటంతో వైద్యులు ముందుకు రావడం లేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్ హోదా ఉన్న వారికి ప్రతి నెలా రూ.40 వేలు, స్టాఫ్‌నర్సులకు రూ.29 వేలు చొప్పున జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఇస్తున్నారు. అయితే గ్రామాల్లోకి వెళ్లి విధులు నిర్వర్తించే కన్నా ప్రైవేటు ఆసుపత్రుల్లో పని చేస్తే భారీ వేతన ప్యాకేజీలు అందుతుండటంతో యువ వైద్యులు ముందుకు రావడం లేదు. కొత్తగా ఎంబీబీఎస్ పూర్తి చేసినవారు ఇటువైపు రావడానికి ఆసక్తి చూపడం లేదు.ఇటీవల 25 పోస్టులు భర్తీ చేశాంమంథని వంటి దూర ప్రాంతాల్లో సేవలందించేందుకు ఎంఎల్‌పీలు ముందుకు రావడం లేదు. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఖాళీగా ఉన్న 25 పోస్టులను ఇటీవల భర్తీ చేశాం.

# తరుగుతున్న ఆశలు..!



ఖమ్మం : అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు అష్టకష్టాలు పడుతున్న రైతులపై మిల్లర్ల పెత్తనం మొదలైంది. అసలే కొనుగోళ్ల ప్రక్రియ ఊపందుకోక, కేంద్రాల్లో టార్పాలిన్లు లేక అవస్థలు ఎదుర్కొంటున్న అన్నదాతలకు 'తరుగు దందా' మరింత గుబులు పుట్టిస్తోంది. క్వింటాకు 5- 7 కిలోల తరుగు తీసేందుకు అంగీకరిస్తేనే మిల్లుల్లో ధాన్యం దించుకుంటామని మిల్లర్లు తెగేసి చెబుతుండటంతో కర్షకులు అవాక్కవుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో తరుగుకు తీసేందుకు కొందరు అంగీకరిస్తుంటే.. మరికొందరు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు.

ఉభయ జిల్లాల్లో..రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. ఖమ్మం జిల్లాలో 15 రోజుల క్రితం కొనుగోళ్లు ప్రారంభం కాగా.. ఇప్పటివరకు 180 కేంద్రాల ద్వారా 5 వేల మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించారు. మిల్లులకు 2,100 మె.ట. తరలించారు. భద్రాద్రి జిల్లాలో 16 కేంద్రాల్లో 1,125 మె.ట. ధాన్యాన్ని కొన్నారు. 900 మె.ట. సరకును మిల్లులకు పంపించారు. నిల్వ చేసేందుకు స్థలం లేక సరకును తీసుకోబోమంటూ ఇప్పటివరకు కొర్రీలు పెట్టిన మిల్లర్లు.. అధికారుల చొరవతో ఎట్టకేలకు రెండు జిల్లాల్లో కలిపి 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు అంగీకరించారు. అంతలోనే తరుగు పేరిట దందాకు తెరలేపడంతో రైతులు విలవిలలాడుతున్నారు.

వాస్తవానికి ఏం జరగాలంటే..?

టిక్కీ ధాన్యం 41 కిలోలు ఉంటే 40 కిలోలకు సరిపడా డబ్బులు రైతుల ఖాతాల్లో పడాలి. తరుగు కింద కిలో పోతుంది. అయితే.. రైతుల అవసరాలను అవకాశంగా మలుచుకుంటున్న మిల్లర్లు ఇష్టానుసారం తరుగు తీస్తున్నారు. తేమశాతం, నాణ్యత, ప్రస్తుతం మిల్లుల్లో ధాన్యం నిల్వలకు చోటు లేదనే సాకు చూపి క్వింటాకు 5-7 కిలోల తరుగు విధిస్తున్నారు. కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలే బేరాల అడ్డాగా మారుతుండగా.. మరికొన్నిచోట్ల మిల్లుల వద్దకు లారీలు వెళ్లిన తర్వాత తరుగు తప్పదని చెబుతుండటంతో రైతులు నిశ్చేష్టులవుతున్నారు. అక్కడక్కడ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే మధ్యవర్తులుగా ఉంటూ తరుగు బేరం కుదుర్చుతున్నారు. తాము చెప్పిన తరుగు ఇచ్చేందుకు అంగీకరిస్తే ఒకలా.. లేకుంటే మరోలా ప్రవర్తిస్తూ రైతులకు చుక్కలు చూపిస్తున్నారు.

కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తికాగానే కేటాయించిన మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించాం. నిబంధనల ప్రకారమే తరుగు తీయాలి. ఎక్కడైనా రైతులకు ఇబ్బందులు ఎదురైతే మాదృష్టికి తీసుకురావాలి.
మధుసూదన్, అదనపు కలెక్టర్, ఖమ్మం

3.20 ఎకరాల్లో వరి పండించాను. ఈసారి పంట బాగా పండిందని సంతోషపడుతుంటే కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. ఇంకోపక్క మిల్లర్లు క్వింటాకు 4-6 కిలోల తరుగు తీస్తామంటున్నారు. చేసేదేమీలేక అడిగినంత ఇస్తున్నాం.
మరీదు కృష్ణ, సదాశివునిపాలెం, సత్తుపల్లి మండలం

కిష్టారం ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోంది. క్వింటా ధాన్యానికి ఏడు కిలోల వరకు మిల్లర్లు తరుగు తీస్తున్నారు. ఏంచేయాలో అంతుపట్టడం లేదు.
మోరంపూడి కృష్ణ, కిష్టారం, ఖమ్మం జిల్లా

# ఆటల కోట సిద్ధం

ఖమ్మం : క్రీడాకారుల నైపుణ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కల్లూరులో సకల హంగులతో నిర్మించిన ఇండోర్ స్టేడియం ప్రారంభానికి ముస్తాబైంది. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రత్యేక కృషితో స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్మాణాలకు ప్రభుత్వం రూ.3.40కోట్లు మంజూరు చేసింది. ఈ నెల 29న ఉదయం క్రీడాకారులశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించనున్నారు. క్రీడాకారులకు వరం ఇండోర్ స్టేడియం పనులు రూ.2.10కోట్లతో పూర్తయ్యాయి. ఈ స్టేడియం వద్ద ఓపెన్ జిమ్, కబడ్డీ కోర్టు, టేబుల్ టెన్నిస్, స్ఫూర్తిదాయక చిత్రాల పనులు పూర్తయ్యాయి. ఇండోర్ స్టేడియంలో షటిల్‌బ్యాడ్మింటన్ కోసం అధునాతన ఉడెన్ కోర్టు ఏర్పాటైంది. ఇందులోనే బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ కోర్టులుండటం మరో



విశేషం. ఇంకా బాస్కెట్‌బాల్, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ పిచ్ నిర్మాణపనులు చివరి దశలో ఉన్నాయి. కల్లూరు మండల క్రీడాకారులకు ఈ స్టేడియం వరంగా మారనుంది. గతంలో పలు క్రీడల్లో నైపుణ్యాల పెంపునకు సరైన స్టేడియాలు, శిక్షకులు లేకపోవడంతో ఖమ్మం, హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. దీంతో వ్యయప్రయాసలకు గురయ్యేవారు. ప్రస్తుతం ఇండోర్ స్టేడియం అందుబాటులోకి రావడంతో తమ క్రీడాప్రతిభను మెరుగుపరుచుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతామని యువకులు, విద్యార్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఇండోర్ స్టేడియాన్ని అత్యాధునికంగా, క్రీడాకారులకు సౌకర్యంగా తీర్చిదిద్దారు. కొన్ని ఆటలకు సంబంధించి కోర్టులు త్వరలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తాం. క్రీడాకారులకు మే నెలలో జరిగే వేసవి శిబిరంలో పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.
పరంధామరెడ్డి, జిల్లా క్రీడల అధికారి

# పెద్దలపై ప్రేమ.. సామాన్యులపై ప్రతాపం

జనగామ : అక్రమ నిర్మాణాల కూల్చివేతల్లో రాజకీయ అండదండలు, పలుకుబడి కలిగిన పెద్దలపై ప్రేమ చూపడం, సామాన్యులపై ప్రతాపం చూపించడం గ్రేటర్ వరంగల్ టౌన్‌ప్లానింగ్ విభాగానికి అలవాటైంది. నగరంలోని బద్రకాళి చెరువు చుట్టూ పెద్ద పెద్ద భవనాలు వెలిశాయి. సుప్రీంకోర్టు జారీ చేసిన ఫుల్ ట్యాంకు లెవల్ (ఎఫ్‌టీఎల్) నిబంధనలకు విరుద్ధంగా అపార్టుమెంట్లు, వాణిజ్య, నివాస భవనాలు వెలుస్తున్నాయి. ఇలాంటివి వదిలేసి సాధారణ ప్రజలు కట్టుకున్న చిన్న షెడ్లు, ప్రహరీలను కూల్చేయడం తీవ్రమైన విమర్శలకు దారితీస్తుంది. బుధవారం హంటర్‌రోడ్డు సంతోషిమాత గుడి వెనక ప్రాంతంలో రెండు రేకుల షెడ్లు, ఒక ప్రహరీ కూల్చివేత వివాదాస్పదమైంది. రాష్ట్ర హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధి ఒత్తిళ్లతోనే కూల్చివేశారని బాధితులు వాపోయారు. బల్దియా ప్రధాన కార్యాలయం ముందు బాధితులు, భాజపా నాయకులు ధర్నా చేశారు.

బడా భవనాల సంగతేంటీ?

భద్రకాళి చెరువు చుట్టూ 2013లో ఎఫ్‌టీఎల్ దిమ్మెలు పాతారు. హనుమకొండ పద్మాక్షిగుట్ట రోడ్డు, హంటర్‌రోడ్డు, పాత సిటిజన్ క్లబ్ వెనక, గాయత్రినగర్, సాయినగర్, సంతోషిమాత కాలనీ, ఎన్టీఆర్‌నగర్ వైపు ఎఫ్‌టీఎల్ నిబంధనలకు విరుద్ధంగా బడా భవనాలు కట్టారు. సుమారు 250 నుంచి 300 వరకు ఇళ్లు నిర్మించారు. కొన్ని వాణిజ్య భవనాలు కూడా ఉన్నాయి. పదేళ్లుగా నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారు. ప్రముఖుల అండతోనే టౌన్‌ప్లానింగ్ విభాగం పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. ఇలాంటి వాటిపై చర్యలేందుకు తీసుకోవడం లేదని సామాజిక కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

ఒక్కరికి నోటీసు ఇచ్చి రెండు కూల్చేశారు

హంటర్‌రోడ్డు సంతోషిమాత గుడి వెనక కూల్చివేతల్లో గ్రేటర్ వరంగల్ టౌన్‌ప్లానింగ్, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారుల తప్పిదాలు వెలుగులోకి వచ్చాయి. ఒకరికి నోటీసు ఇచ్చి పక్కనే ఉన్న రెండు షెడ్లను తొలగించినట్లుగా తెలిసింది. 2016లో హనుమకొండ కిషన్‌పురకు చెందిన గాయత్రి జోషి, జుగల్ పాండే, జ్యోతి జోషి హంటర్‌రోడ్డు భద్రకాళి చెరువు కట్టకు సమీపంలో సర్వేనంబర్లు 656, 657, 658లో 300 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. స్థలం చుట్టూ ప్రహరీ, షెడ్డు వేసుకున్నారు. బల్దియా నుంచి ఇంటి నంబర్లు పొందగా, కొందరు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగం జుగల్ పాండేకు అక్రమ నిర్మాణం, ఎఫ్‌టీఎల్ నిబంధనల ఉల్లంఘన పేరుతో నోటీసు జారీ చేసింది. బుధవారం కూల్చివేతల్లో భాగంగా ఒక్కరికి నోటీసిచ్చి పక్కనే ఉన్న మరో రెండు షెడ్లు తొలగించడం వివాదాస్పదమైంది.

కూల్చివేతపై బాధితులు నిలదీయగా ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. బల్దియా పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల్లో జంబ్లింగ్ సిస్టం అమలవుతోంది. వరంగల్‌లో కూల్చివేతలు జరిగితే హనుమకొండ బృందం వస్తుంది. హనుమకొండలో వరంగల్ బృందాలు వెళ్తున్నాయి. కూల్చివేతలకు హనుమకొండ టీం వచ్చింది. జుగల్ పాండే నిర్మాణంతో పాటు పక్కనే ఉన్న మరో రెండు షెడ్లు కూల్చేశారు. నోటీసివ్వకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించినా.. అధికారులు పట్టించుకోలేదని తెలిసింది. ఈ విషయాన్ని టౌన్‌ప్లానింగ్ విభాగం గోప్యంగా ఉంచింది.

బాధితులకు న్యాయం చేయాలి

సంతోషిమాత గుడి వెనుక గ్రేటర్ టౌన్‌ప్లానింగ్, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు చేపట్టిన కూల్చివేతలతో నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బల్దియా ప్రధాన కార్యాలయం ముందు మార్వాడీ మహిళలు, భాజపా నాయకులు ధర్నా చేపట్టారు. ఐదారేళ్లుగా ఇంటిపన్ను చెల్లిస్తున్నామని, రెండు, మూడు నెలలుగా అధికారులు ఒత్తిళ్లకు గురి చేశారని బాధిత మహిళలు గాయత్రి జోషి, జ్యోతి జోషి తెలిపారు. కూల్చివేతలతో మిఠాయిలు తయారు చేసే సామగ్రి, ఇతర వస్తువులు పాడయ్యాయని, రూ.15 లక్షల నష్టం వాటిల్లందన్నారు. భాజపా నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్ మాట్లాడుతూ.. భద్రకాళి చెరువు పరిసరాల్లో వందలాది నిర్మాణాలు వచ్చాయని, వాటన్నింటిని వదిలేసి మర్వాడీ మహిళల షెడ్లను కూల్చేయడం సరికాదన్నారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఉపకమిషనర్ రషీద్‌కు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు రత్నం సతీషా, పరమేశ్వర్, రంజిత్, హరిశంకర్ పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనతోనే కూల్చివేత

# ఇలా ఆక్రమించుకుంటరు..!



ఖమ్మం : సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలోని చీపురుకుంట క్రమేణా కనుమరుగవుతోంది. నిజాం కాలం నుంచి మనుగడలో ఉన్న ఈ జలాశయం ముప్పై ఏళ్ల క్రితం వరకు నీటితో కళకళలాడింది. ఆయకట్టులో పంటలకు సాగునీరందించింది. భూములకు ధరలు పెరగడం, అసలు పట్టాదారులే లేకపోవడంతో కొందరు అక్రమార్కుల కళ్లుపడ్డాయి. కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేసి దొడ్డి దారిలో పట్టాలు సంపాదించుకుని ఎంచక్కా కుంటలో సాగు చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆరు ఎకరాల్లో మిగిలింది రెండెకరాలే..

కుంట విస్తీర్ణం 6.01 ఎకరాలుండేది. ఆ భూముల్లో ప్రస్తుతం రెండెకరాలే మిగిలాయి. దాదాపు నాలుగెకరాల వరకు పరిసర రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు పుట్టించి సాగు చేసుకుంటున్నారు. గతంలో వర్షం నీటితోపాటు బేతుపల్లి కాల్వ నుంచి కుంటలోకి వరదనీరు చేరి ఆయకట్టులోని సుమారు 50 ఎకరాల్లో రైతులు పంటలను పండించేవారు. క్రమంగా బేతుపల్లి నీరు రాకుండా చేయడంతోపాటు కుంటలో ఉన్న నీటిని ఇష్టానుసారంగా తోడేయడంతో అది ఎండిపోయింది. ప్రస్తుతం అక్కడ ఎకరం రూ.30లక్షల వరకు పలుకుతుండటంతో ఆ భూములను దక్కించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి.

రద్దయిన పాసు పుస్తకాలకు మళ్లీ ప్రాణం

గ్రామానికి చెందిన కొందరు రైతులు చీపురుకుంటను కాపాడుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు దొడ్డిదారిలో సంపాదించిన పాసు పుస్తకాలను 2007లో నాటి ఆర్డీవో రద్దు చేశారు. ఆ తర్వాత గడిచిన రెండు, మూడేళ్లలో రద్దైన తమ పాసు పుస్తకాలను మళ్లీ దక్కించుకున్నారు. ఒకసారి ఆర్డీవో రద్దు చేసిన పాసు పుస్తకాలు ప్రాణం పోసుకోవడంతో కుంట కోసం పోరాడుతున్న రైతులు హతాశులయ్యారు. ఇదిలా ఉంటే బేతుపల్లి కాల్వ వరకు ఉన్న కుంట కాల్వ నిరుపయోగంగా మారింది. ఇదే అదనుగా కొందరు కొబ్బరి, వేప, మామిడి మొక్కలు నాటుతూ కాల్వ కట్టను ఆక్రమిస్తున్నారు.

సర్వే చేసి సరిహద్దులు మరిచారు

కబ్జా కోరల్లో చిక్కుకున్న కుంటను కాపాడుకోవడం కోసం కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఐబీ అధికారులు ఇటీవల కుంటకు హద్దులు నిర్ణయించారు. అయితే సర్వే చేసి సరిహద్దులు నిర్ధారించలేదని సంబంధిత రైతులు వాపోతున్నారు. కుంట భూముల్లో రద్దైన పాసుపుస్తకాలను మళ్లీ ఎలా ఇచ్చారనే అంశమై కలెక్టర్‌ను కలుస్తామని, ఆ పాసుపుస్తకాలను రద్దు చేయాలని మళ్లీ హైకోర్టును ఆశ్రయిస్తామని చెబుతున్నారు.

కుంటను సర్వే చేసే క్రమంలో కొందరు తమ పట్టాదారు పాసుపుస్తకాలు చూపుతున్నారు. అవి ఉంటే ఏం చేయలేం. కానీ కుంటను తవ్వడం, మట్టి పోసి అభివృద్ధి పరచడం తదితరాలు చేస్తే చర్యలకు ఉపక్రమిస్తాం.
వెంకటేశ్వరరావు, జేఈ, ఐబీ

చీపురుకుంట వివాదం మా దృష్టికి వచ్చింది. మూడునాలుగు రోజుల్లో జలవనరుల శాఖ అధికారులతో కలిసి సంయుక్త విచారణ చేపడతాం. పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నా కుంట రూపురేఖలు దెబ్బతినేలా వ్యవహరిస్తే మాత్రం చర్యలు తీసుకుంటాం.
సూర్యనారాయణ, ఆర్డీఓ

# ఖరీదైన పరీక్షలు ఉచితంగా.. ఖచ్చితంగా..

ఖమ్మం : 'మహిళా ఆరోగ్య భద్రత'పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. బాలింతలు, గర్భిణులతో పాటు సాధారణ స్త్రీలకు వైద్య సహాయం అందించేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆరోగ్య మహిళ' పథకాన్ని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఏజెన్సీ జిల్లా భద్రాద్రి కొత్తగూడెంలో ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పథకం సేవలు ప్రారంభించింది. ఇప్పటి వరకు 2 వేల మందికి పైగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. తప్పిన దూరభారం: ఇటీవల రొమ్ము, గర్భసంచి, థైరాయిడ్ క్యాన్సర్లు విజృంభిస్తున్నాయి. గ్రామీణ ప్రాంత మహిళలకు ముందస్తు పరీక్షలు చేయించుకోవడంపై అవగాహన ఉండటం లేదు. కొందరికి సమస్యలున్నా ఆర్థిక స్థోమత లేక చికిత్సకు వెళ్లడం లేదు. తీరా చేయిదాటాక రోగ నిర్ధారణ కావడంతో ప్రాణాపాయం ఎదురవుతోంది. పైగా చికిత్సకు హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితులు అధిగమించేలా జిల్లాలోని పెనగడప, పర్ణశాల, కొమరారం, ఎంపీబంజర, ఎర్రగుంట పీహెచ్‌సీల పరిధిలో ముందస్తుగా ముఖ్యమైన రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇందుకోసం ఆస్పత్రుల పరిధిలో 40 క్లీనిక్‌లు కొనసాగిస్తున్నారు. ప్రతీ కేంద్రంలో ఇద్దరు వైద్య సిబ్బంది మహిళల ఆరోగ్య వివరాలు ట్యాబ్‌లో పొందుపరుస్తున్నారు. ప్రాథమిక పరీక్షల్లో అనుమానం వస్తే జిల్లా సర్వజన ఆసుపత్రిలోని రేడియాలజీ హబ్‌కు రిఫర్ చేస్తున్నారు. ఇక్కడ రొమ్ము క్యాన్సర్ గుర్తించే ఆధునిక పరికరం (మామోగ్రామ్) ఉంది. హృదయ సంబంధ లోపాల్ని గుర్తించేందుకు 2డీ ఎకో పరీక్షలు చేస్తారు.

# అత్యవసర వైద్యం.. అందని దైన్యం

ఖమ్మం : మన్యం జిల్లాలో తరచూ ఏదో ఒకచోట రోడ్డు రక్తసిక్తమవుతోంది. ప్రమాద క్షతగాత్రులు అత్యవసర వైద్యానికి నోచని పరిస్థితులు నెలకొన్నాయి. వైద్య బోధనాసుపత్రికి అనుబంధంగా అప్‌గ్రేడ్ చేసిన కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిలోనూ అత్యవసర వైద్య సేవల విభాగం (ట్రామా) లేకపోవడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని పైస్థాయి దవాఖానాలకు సిఫార్సు చేయక తప్పని పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 'తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఇనిషియేషన్(టెరి)' పథకంతోనైనా ఈ లోటును పూడ్చాల్సిన అవసరం ఉంది. జగదల్‌పూర్-విజయవాడ జాతీయ రహదారి, కొత్తగూడెం-ఖమ్మం రాష్ట్రీయ రహదారి, మణుగూరు-ఏటూరు నాగారం-వరంగల్-హైదరాబాద్, భద్రాచలం - రాజమహేంద్రవరం హైవేలు మన్యం జిల్లా భద్రాద్రి మీదుగా వెళ్తున్నాయి. ఆయా ప్రధాన మార్గాలకు అంతర్గతంగా ఎన్నో రహదారులు అనుసంధానమై ఉన్నాయి. ఇదే క్రమంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రకృతి విపత్తులు, ఊహించని ప్రమాదాల క్షతగాత్రులు సైతం ప్రాణాపాయ స్థితిలో ప్రభుత్వ వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. కానీ జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఏరియా ఆసుపత్రుల్లో గానీ, కొత్తగూడెం జిల్లా సర్వజన దవాఖానాలో గానీ 'ట్రామా కేర్' కేంద్రాలు లేవు. ప్రధాన ఏజెన్సీ జిల్లా కేంద్రాల్లో ఈ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు 2019లో గాంధీ ఆసుపత్రిలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. అత్యవసర సేవల విభాగం ఏర్పాటు అనివార్యమని భావించారు. తాజాగా ప్రభుత్వం 'టెరి' పథకాన్ని ప్రకటించింది. గత ప్రతిపాదనలు అటకెక్కిన నేపథ్యంలో.. రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులు వందలాది మంది అత్యవసర వైద్యానికి



నోచక మృత్యువాతపడ్డారు.

ప్రమాదాల వరుస

జిల్లా పరిధిలో కేవలం ఈ ఏడాది మూడు నెలల్లోనే 119 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. వాటిల్లో 130 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు 60 మందికిపైగా ఉన్నారు. ప్రమాదాల్లో ఏడాదికి సగటున 240 మంది వరకు చనిపోతున్నారు. మరో 560 మంది వరకు క్షతగాత్రులు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇలాంటి వారికి సకాలంలో చికిత్సలు అందించేందుకు ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో ట్రామా కేంద్రం లేకపోవడం గమనార్హం. 'భద్రాద్రి' మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇసుక, కలప, సిమెంటు, యాష్, బొగ్గు, పారిశ్రామిక ముడిసరకు రవాణా వాహనాలు తరచూ ఎక్కడో ఒకచోట భారీ ప్రమాదానికి గురవుతున్నాయి. పెనగడప, రాంపూర్, కొత్తగూడెం, భద్రాచలం, సారపాక, పాల్వంచ, పెద్దమ్మతల్లి గుడి, నవభారత్, కేవస్ఎం రోడ్డు తదితర ప్రాంతాలు డేంజర్‌స్పాట్స్‌గా మారాయి.

# నిరసనలు.. నిలదీతలు

జనగామ : 'వార్డుల్లో అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితం. కుక్కల దాడులు, కోతులు, పందుల బెడద, పారిశుధ్యం అధ్వానం, బిల్లులు, చెల్లింపులకే పరిమితమైన ఎజెండా, మూడున్నర ఏళ్లు గడిచినా, వార్డుల్లో చెప్పదగిన పనులు లేవు' అంటూ జనగామ మున్సిపల్ కౌన్సిలర్లు రుసరుసలాడారు. ప్రతిపక్ష సభ్యులతో పాటు, అధికార భారాస సభ్యులు సమస్యలను ఏకరవు పెట్టారు. పోడియం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. జనగామలో గురువారం ఛైర్‌పర్సన్ పి.జమున అధ్యక్షతన నిర్వహించిన పురపాలిక సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. కౌన్సిలర్‌గా ఎన్నికై మూడున్నరేళ్లు గడిచినా పట్టుమని రూ.10 లక్షల పని చేయలేదని, అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనాన్ని చూసి ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలిచ్చినా పట్టింపు లేదని 13వ వార్డు సభ్యురాలు మల్లిగారి చంద్రకళ వాపోయారు. పోడియం ముందు బైఠాయించి ఆవేదన వ్యక్తం చేశారు.

కుక్కల సమస్యకు పరిష్కారం లేదా?: 11, 12 వార్డుల సభ్యులు పాక రమ, గుర్రం భూలక్ష్మి మాట్లాడుతూ, తమ వార్డుల పరిధిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. 28వ వార్డు సభ్యుడు సమద్ సమస్య తీవ్రతను వివరించి వివరణ కోరారు. కాంగ్రెస్ ఉపనాయకుడు గాదెపాక రాంచందర్



మాట్లాడుతూ ధర్మకంచ, సంజయ్‌నగర్, అంబేడ్కర్‌నగర్ తదితర వార్డుల్లో పందులు తిరుగుతున్నాయన్నారు. మున్సిపల్ కబేళాలో పరీక్షలు లేకుండానే మేకలు, గొర్రెలను వధించి, అనారోగ్యకరమైన మాంస విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కబేలాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. తన వార్డులో నాలుగు లైట్లు కావాలని, రోజూ చెత్తసేకరణ వాహనం ఏర్పాటు చేయాలని కోరినా పని జరగడం లేదని 14వ వార్డు కౌన్సిలర్ స్వరూప ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెలలో తాము ఎజెండాను ఆమోదించకపోయినా, కోరం లేకున్నా ఎలా ఆమోదించారని కాంగ్రెస్ సభ్యులు అధికారులను నిలదీశారు. సభ్యుల ప్రస్తావనలకు ఛైర్‌పర్సన్ జమున, వైస్‌ఛైర్మన్ రాంప్రసాద్, కమిషనర్ రజిత, డీఈ చంద్రమౌళి వివరణ ఇచ్చారు. వార్డు సభ్యులు ప్రేమలతారెడ్డి, బొట్లశ్రీనివాస్, రామగళ్ల అరుణ, సుమలత, కమలమ్మ, చందర్, నాగరాజు, పి.సుధ, కోఆప్షన్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ఎజెండా అంశాలన్నీ ఆమోదం పొందాయని కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# గడువు ముందర... పనులకేది తొందర

సిరిసిల్ల: ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించి ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యానందించాలనే లక్ష్యంతో 2022 మార్చిలో 'మన ఊరు– మన బడి' పథకాన్ని ప్రారంభించారు. మూడు విడతల్లో అమలు చేసే ఈ కార్యక్రమంలో తొలి విడతగా జిల్లాలో 172 పాఠశాలను ఎంపిక చేశారు. మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాలోని గంభీరావుపేటలో 3, వీర్నపల్లిలో 1, ఎల్లారెడ్డిపేటలో 3, బోయినపల్లిలో 1 మొత్తం పది పాఠశాలలను సీఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత)లో బాగు చేయనున్నారు. మిగతా వాటిలో 153 పాఠశాలలకు మాత్రమే పరిపాలనా అనుమతులు వచ్చాయి. వీటిలో రూ.30 లక్షలలోపు పనులకు నిధులు మంజూరయ్యాయి. ఆపై అంచనాలతో చేపట్టేవి టెండర్ల ద్వారా చేయాలని ఉత్తర్వులిచ్చారు. మార్చిలో ప్రారంభించిన పథకాన్ని తొలి విడత పనులు జూన్ 14లోపు కనీస మరమ్మతులైనా పూర్తిచేయాల్సి ఉంది.

పాఠశాల విద్యాశాఖ ఈ నెల 13 నుంచి పాఠశాలలు పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. అన్ని చోట్ల వసతులు కొరవడి విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. శిథిల గదులు, మరుగుదొడ్లు, అస్తవ్యస్తమైన విద్యుత్తు సరఫరా, ప్రహరీలు, అదనపు గదుల నిర్మాణం వంటి పనులు ప్రారంభించలేదు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టనున్నారు. దీనివల్ల ఇప్పుడున్న గదులు చాలవు. పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు అవస్థలు తప్పేలా లేవు. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలక సంఘాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రహరీ, మరుగుదొడ్లు, వంట, భోజనశాలల నిర్మాణాలను ఉపాధి హామీ పథకంలో చేపడుతున్నారు. విద్యుద్దీకరణ, మిషన్ భగీరథలో తాగునీటి సరఫరా, పూర్తిస్థాయి మరమ్మతులు, శిథిలమైన గదుల స్థానంలో కొత్తవి నిర్మాణం, ఉన్నత పాఠశాలలకు అదనపు గదులు నిర్మించాల్సి ఉంది. పట్టణంలో ఉపాధి హామీ పథకం అమలు కాకపోవడంతో అన్ని పనులను చేపట్టాల్సి ఉంది. వీటికి ఆయా ఇంజినీరింగ్ అధికారులచే అంచనాలు రూపొందించారు. మరుగుదొడ్లకు మరమ్మతులు, తాగునీరు, విద్యుత్తు సౌకర్యం, నేల మరమ్మతులు, గదులకు రంగులు వేయడం వంటివి ఒకటి రెండు చోట్ల మినహా ఎక్కడా ప్రారంభమే కాలేదు.

కమిటీల వెనకడుగు

తొలి విడత ఎంపిక చేసిన వాటిలో 81 పాఠశాలలకు రూ.16 కోట్లతో పరిపాలన అనుమతులు వచ్చాయి. వీటిలో పదిశాతం నిధులు కలెక్టర్ అనురాగ్ జయంతి యాజమాన్య కమిటీల ఖాతాల్లో జమ చేశారు. పనులను పూర్తి చేసిన వెంటనే మరిన్ని నిధులు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానాన్ని అనుసరిస్తున్నారు. కానీ ప్రక్రియ సంక్లిష్టంగా ఉండటంతో యాజమాన్య కమిటీలు చాలా చోట్ల పనులు చేసేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. తొలుత పదిశాతం మాత్రమే నిధులిచ్చారు. పనులు ప్రారంభించి పూర్తి చేయాలంటే సొంతంగా నిధులు వెచ్చించాల్సి ఉంది. బిల్లుల్లో జాప్యం జరిగితే వడ్డీలకు చాలవనే భావన కమిటీల్లో ఉంది. మొత్తం నిధులు సకాలంలో అందజేస్తేనే పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉంది. రూ.30 లక్షల పనులకు ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను తీసుకొస్తున్నారు. ఈ లెక్కన తొలి విడత పనులకే ఏడాది సరిపోయేలా లేదు.

సకాలంలో పూర్తి చేసేలా చర్యలు– రాధాకిషన్, డీఈవో

జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు మొదలయ్యాయి. పనుల ప్రాధాన్య క్రమాన్ని బట్టి నిర్ణీత సమయంలోగా పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా ముందుకెళ్తున్నాం.

## కొనసాగుతున్న సదర్‌మట్

ఇబ్రహీంపట్నం : గోదావరి నదిలో వృథాగా పోతున్న నీటిని నిల్వచేసి, ఆ నీటితో మరిన్ని భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాల మధ్య గోదావరి నదిపై సదర్‌మట్ బ్యారేజీని నిర్మిస్తున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్, నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామాల శివార్లలోని గోదావరి నదిపై సదర్‌మట్ రోడ్, బ్యారేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 2016లో నిధులు మంజూరు చేయగా, అదే సంవత్సరంలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాగా పలు కారణాలతో నేటికి బ్యారేజీ పనులు పూర్తి కాలేదు.

2016లో శంకుస్థాపన

సదర్‌మట్ బ్యారేజీ నిర్మాణానికి ప్రభుత్వం మొత్తం రూ.582.62 కోట్లు కేటాయించడంతో 2016 నవంబర్‌లో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ బ్యారేజీ నిర్మాణం పూర్తయితే 1.58 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. బ్యారేజీ నిర్మాణంలో రెండు జిల్లాలో మొత్తం 720 ఎకరాల సాగు భూములు ముంపునకు గురయ్యాయి. ఇందులో నిర్మల్ జిల్లాలో 406 ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 314 ఎకరాల భూమిని రైతుల నుంచి అధికారులు సేకరించారు. భూ సేకరణ కోసం రూ.115 కోట్లు కేటాయించి, రైతులకు పరిహారాన్ని అందజేశారు. కాగా ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటి కొండాపూర్‌లో, మామడ మండలంలోని కమల్ కోట్‌లో ఇంకా భూసేకరణ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు.

80 శాతం పూర్తిబ్యారేజీ నిర్మాణ పనులు 2016 నవంబర్‌లో ప్రారంభం కాగా, భూ సేకరణతో కొంత జాప్యం చోటు చేసుకుంది. భూ సేకరణ పూర్తయిన తర్వాత నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 1.58 టీఎంసీల నీటినిల్వ కోసం గోదావరిపై మొత్తం 55 గేట్లను నిర్మిస్తున్నారు. రూ.384.64 కోట్ల విలువ గల పనులు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.316.46 కోట్ల 82 శాతం మేర 0పనులు పూర్తయ్యాయి. 2.80 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు సుమారు 2.50 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తికాగా, ఇంకా 30 వేల క్యూబిక్ మీటర్ల పనులు జరగాల్సి ఉంది. కాగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతోనే నిర్మాణంలో జాప్యం చేటు చేసుకుంటుందని ఆయా గ్రామాల రైతులు అభిప్రాయపడుతున్నారు. తగ్గనున్న దూరాభారంబ్యారేజీపై రహదారి నిర్మిస్తుండడంతో నిర్మల్ జిల్లాకు రాకపోకలు సాగడానికి మరింత వీలుగా ఉంటుంది. దీంతో దూరాభారం తగ్గడంతో పాటు సమయంతో పాటు ధనం కూడా ఆదా అవుతుంది. బ్యారేజీ నిర్మాణం పూర్తయితే రెండు జిల్లాల్లో 18,016 ఎకరాలకు సాగునీరు అందనుంది.

డిసెంబర్‌లో షట్టర్లు బిగిస్తాం– రామారావు, ఈఈ, నీటిపారుదల శాఖ, నిర్మల్ జిల్లాసదర్‌మ ట్ బ్యారే. ఈ నిర్మాణ పనులు భూసేకరణ ఆలస్యం కావడంతో పనులు జరిగినపుడు రైతులు అడ్డుకోవడం వల్ల జాప్యం చోటుచేసుకుంది. ఇప్పటి వరకు 82 శాతం మేర పనులు పూర్తయ్యాయి. కాంక్రీట్ పనులు దాదాపు పూర్తి కాగా, షట్టర్ల బిగింపు పనులను డిసెంబర్‌లో పూర్తి చేస్తాం.

# న్యాయసేవలిక కొత్త జిల్లాల్లోనే..!




కరీంనగర్ : ఎట్టకేలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో న్యాయసేవలపరంగా ఇక కొత్త పంథా కనిపించనుంది. పరిపాలన సౌలభ్యం కోసం 2016లో కొత్త జిల్లాలు ఏర్పాటైనా.. ఇప్పటివరకు కరీంనగర్ నుంచే మిగతా మూడు జిల్లాల పర్యవేక్షణ కొనసాగింది. ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఉన్న ప్రధాన న్యాయమూర్తి పరిధిలోనే మిగతా జిల్లాలోని కోర్టులన్నీ ఉండేవి. నేటి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలు ఎక్కడికక్కడే ప్రధాన న్యాయస్థానాలుగా మారనున్నాయి. వాటి పరిధిలోని కోర్టుల పరిపాలన వ్యవహారమంతా అక్కడి ప్రధాన న్యాయస్థానం పరిధిలోనే ఉండనున్నాయి. ఇందులో భాగంగానే ఇటీవల అన్ని జిల్లాలకు ప్రధాన న్యాయమూర్తుల నియామకం జరిగింది. అక్కడ ఉన్న అదనపు జిల్లా న్యాయస్థానాలను జిల్లా ప్రధాన న్యాయస్థానాలుగా నేటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా నియమితులైన వారే ప్రధాన న్యాయమూర్తులుగా వ్యవహరిస్తూ వాటి పరిధిలోని అన్ని కోర్టుల బాధ్యతల్ని చూడనున్నారు. ఇక మీదట కరీంనగర్ కోర్టుతో ఉన్న సంబంధాలు వీడనున్నాయి.

పరిధులు అటు ఇటుగా..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13 పట్టణాల పరిధిలో జూనియర్ సివిల్, సీనియర్ సివిల్, అదనపు జిల్లా న్యాయస్థానాలుండేవి. ఇప్పుడు మారిన రూపురేఖల ప్రకారం ఆయా జిల్లాల పరిధిలోనే సేవలందనున్నాయి. నేడు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూరి ఎన్.వి.రమణ, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, హైకోర్ట్ చీఫ్ జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలు ఆన్‌లైన్‌లో కొత్త న్యాయస్థానాలను సాయంత్రం 5 గంటలకు ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఆయా జిల్లాలకు ప్రత్యేకంగా ఈ ప్రారంభోత్సవాలకు హైకోర్టు పలువురు న్యాయమూర్తులను ఇన్చార్జిలుగా నియమించింది. ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, హుజూరాబాద్ పట్టణాల్లోని కోర్టులు మాత్రమే ఉండనున్నాయి. ఇప్పటి వరకు ఈ జిల్లా పరిధిలో ఉన్న హుస్నాబాద్ న్యాయస్థానాలు సిద్ధిపేట జిల్లా కోర్టు పరిధిలోకి వెళ్తున్నాయి. చిగురుమామిడి, గన్నేరువరం మండలంలోని కొన్ని గ్రామాలు కరీంనగర్ జిల్లా కోర్టు పరిధిలోనికి రానున్నాయి. ఇక నిన్నమొన్నటి వరకు సిరిసిల్ల జిల్లా పరిధిలో ఉన్న గంగాధర మండలం పూర్తిగా కరీంనగర్ జిల్లా కోర్టు నుంచి సేవల్ని పొందనుంది. అదేవిధంగా జగిత్యాల జిల్లాకోర్టు జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి న్యాయస్థానాల కేసులను పరిష్కరించనుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో వేములవాడ, సిరిసిల్ల కోర్టులుండనున్నాయి. పెద్దపల్లి జిల్లా కోర్టు పరిధిలో గోదావరిఖని, మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ న్యాయస్థానాలుండనున్నాయి. ఇప్పుడున్నవి కాకుండా త్వరలో మరిన్ని అదనపు, సబ్ కోర్టులు ఆయా జిల్లాల పరిధిలో ఏర్పాటు చేయాలనే యోచనలో హైకోర్టున్నట్లు తెలిసింది.

సత్వర పరిష్కారం..!

ఉమ్మడి జిల్లా కేంద్రంతో సంబంధం లేకుండా ఎక్కడి కేసులు అక్కడే పరిష్కారమవనుండటంతో ఇక మీదట కక్షిదారులకు మేలు జరుగనుంది. ఇన్నాళ్లు ఆయా న్యాయస్థానాల్లో పరిష్కారం కేసులన్ని కరీంనగర్‌కు వచ్చేవి. ఇకపై ఏ జిల్లా పరిధిలోనే పరిష్కారం జరిగే వీలుండనుంది. కొన్ని కేసుల విషయంలో పోలీసులకు దూరభారమనే ప్రయాస ఇకమీద తప్పనుంది. గంగాధరను కరీంనగర్‌లో కలపాలని గత కొన్నేళ్లుగా అక్కడి ప్రజలు కోరుతున్న సమస్యకు ఈ తరహా సంస్కరణ రూపంలో పరిష్కారం లభించింది. ఇక్కడి నుంచి సిరిసిల్ల జిల్లాకు వెళ్లడం వారికి కష్టమైన ప్రక్రియగా ఉండేది. గంగాధర మండల పరిధిలోని 827 కేసులు కరీంనగర్‌కు బదిలీ అవనున్నాయి. ఇదేవిధంగా చిగురుమామడి, గన్నేరువరం మండలాల నుంచి 663 కేసులు కరీంనగర్‌కు బదిలీ చేశారు. ఇక కొత్తగా ఏర్పాటయ్యే జిల్లా కోర్టులపై హైకోర్టు పర్యవేక్షణ ఇక మీద నేరుగా ఉండనుంది. గతంలో ఉమ్మడి జిల్లా కోర్టులన్నింటి బదిలీలు, నియామకాలు, పరిపాలన తీరు అంతా ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఉండేవి. నేటి నుంచి నాలుగు జిల్లా కోర్టులే ఈ బాధ్యతల్ని నిర్వర్తించనున్నాయి. ఒక్క అవినీతి నిరోధక శాఖకు సంబంధించిన ప్రత్యేక న్యాయస్థానం సేవలు మాత్రం కరీంనగర్ నుంచే యథావిధిగా కొనసాగనున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పరిధిలోని కేసులను ఈ న్యాయస్థానంలోనే విచారిస్తారు.

# భక్తిభావం... సేవా మార్గం



వేములవాడ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం కోడె మొక్కులకు ప్రసిద్ధి. దేశంలో ఎక్కడా లేని విధంగా భక్తులు ఇక్కడ కోడె మొక్కులు చెల్లిస్తుంటారు. స్వామివారి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. కొందరు భక్తులు భక్తి, సేవా భావంతో కోడెలకు పశుగ్రాసాన్ని విరాళంగా అందజేస్తుంటారు. ఇందులో భాగంగా కొద్ది రోజులుగా రాజన్న గోశాలలకు భక్తులు, రైతులు భక్తి భావంతో పెద్ద ఎత్తున పశుగ్రాసాన్ని విరాళంగా అందిస్తున్నారు. గత నెల 20 నుంచి ఇప్పటి వరకు దాదాపు 25 వేల క్వింటాళ్ల ఎండు గడ్డిని ఇవ్వడం గమనార్హం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇచ్చిన దీనిని తిప్పాపూర్ గోశాల ఆవరణలో నిల్వ చేస్తున్నారు. ఒక్కో ఎండుగడ్డి కట్ట రూ.53లు ఉంటుందని, రవాణా ఛార్జీలు కలిపితే దాదాపు రూ.100 వరకు వ్యయం అవుతుందని రైతులు చెబుతున్నారు.

టెండర్ గడ్డి నిలిపివేతరాజన్న కోడెలకు భక్తులు, రైతులు పెద్ద ఎత్తున ఎండు గడ్డిని విరాళంగా అందజేయడంతో టెండర్ గడ్డిని ఆలయ అధికారులు నిలిపివేశారు. రూ.6 వేలకు టన్ను చొప్పున టెండర్‌దారు ఎండు గడ్డిని సరఫరా చేయాల్సి ఉంది. కోడెలకు ఎండుగడ్డి లేకపోవడంతో ఆలయ అధికారులు టెండర్ పిలిచారు. ప్రస్తుతం భక్తులు, రైతులు భారీగా అందజేస్తుండటంతో టెండర్ గడ్డిని నిలిపివేసి పచ్చిమేతను తెప్పిస్తున్నట్లు గోశాల అధికారులు పేర్కొన్నారు.

ఆరు ట్రాక్టర్లతో తీసుకొచ్చాం– రమణారావు, సుద్దాల, సుల్తానాబాద్ మండలం, పెద్దపల్లి జిల్లా

గోమాతలకు తమకు తోచిన విధంగా సేవ చేయాలనే ఉద్దేశంతో ఆరు ట్రాక్టర్లలో ఎండుగడ్డిని తీసుకువచ్చాం. కోడెలను రాజన్నతో సమానంగా భక్తులు భావించడం జరుగుతుంది. గోమాతలకు ఎలాంటి ఇబ్బందులు రావద్దని కోరుకొని మాకు తోచిన విధంగా అందిస్తున్నాం.

ఎప్పటి నుంచో అనుకుంటున్నా– శ్రీధర్‌రెడ్డి, స్తంభంపల్లి, బోయినపల్లి మండలంతాను గోమాతలకు ఎండు గడ్డిని విరాళంగా అందజేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నప్పటికి తీసుకురావడానికి వీలు పడలేదు. ఇప్పుడు ఒక ట్రాక్టర్ లోడ్ అందజేసేందుకు తీసుకువచ్చాను. దీనికి అధికారులు రసీదుతో పాటు స్వామివారి ప్రసాదం అందజేశారు.

రక్షణ చర్యలు తీసుకుంటున్నాం– బి.శ్రీనివాస్, ఏఈవో, రాజన్న ఆలయంభక్తులు, రైతులు కోడెలకు అందజేసిన ఎండు గడ్డికి రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా పశుగ్రాసం అందజేశారు. గడ్డి కట్టలను కుప్పలుగా పేర్చి వర్షం నీరు పడకుండా టార్పాలిన్ కవర్లు కప్పి జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరిగితే ఆర్పడానికి వీలుగా గడ్డి కుప్పల చుట్టూ బోరు ద్వారా నీటి పైపు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం.

## అద్దెకివ్వరు.. వినియోగించుకోరు!

కరీంనగర్ : కొండగట్టు అంజన్న ఆలయానికి వచ్చే భక్తులు బస చేయడానికి గదుల కొరత వేధిస్తుంటే మరో వైపు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన దుకాణ భవన సముదాయం గదులను నిరుపయోగంగా వదిలేశారు. కొండగట్టు ఆంజనేయస్వామి నిధులతో చేపట్టే పనుల పట్ల ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రూ.లక్షలాది రూపాయలతో పూర్తి చేసిన దుకాణ భవన సముదాయం గదులు వృథాగా పడి ఉన్నాయి. వ్యాపారులకు, భక్తులకు అద్దెకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో కిరాయిల ద్వారా ప్రతి నెలా ఆలయానికి రావాల్సిన దాదాపు రూ.80 వేలకుపైగా ఆదాయాన్ని నష్టపోవాల్సి వస్తోంది. కొండగట్టు(దిగువ) స్టేజి నుంచి కొండగట్టుపైకి వెళ్లే దారికి కుడివైపున దాదాపు 12 ఏళ్ల క్రితం రూ.60 లక్షలతో నిర్మించిన దుకాణ భవన సముదాయంలోని 20 గదులు నిరుపయోగంగా వదిలేయగా, ఐదేళ్ల క్రితం దాదాపు రూ.2 కోట్లతో నిర్మించిన దుకాణ భవన సముదాయంలోని 19 గదులు వృథాగా పడిఉన్నాయి. వీటిలోని ఒక్కో గదిని వ్యాపారులకు నెలకు రూ.2 వేలకు అద్దెకు ఇచ్చినా పాత గదుల ద్వారా రూ.40 లక్షల వరకు, కొత్త గదుల ద్వారా మరో రూ.40 లక్షల వరకు ఆదాయం వచ్చేదని భక్తులు పేర్కొంటున్నారు. పాత దుకాణ భవన సముదాయంలోని గదులను కొన్ని నెలలపాటు అధికారులు అద్దెకు ఇచ్చినా ఏళ్ల తరబడి వృథాగానే ఉన్నాయి. దుకాణ భవన సముదాయం గదులకు సమీపంలో సులభ్‌కాంప్లెక్సు నిర్మించినా దానికి తాళం వేయడంతో నిరుపయోగంగా మారింది. దుకాణ భవన సముదాయం భవనాల చుట్టూ ప్రహరీ నిర్మించి, వసతులు కల్పిస్తే వాటిని నిత్యం కొండగట్టుకు వచ్చే భక్తులకు అద్దెకు ఇచ్చినా సద్వినియోగమయ్యేవి. కనీసం హనుమాన్ జయంతి ఉత్సవాలకు ముందు అద్దెకు ఇచ్చినా భక్తులకు మేలు జరిగి ఉండేదని ఆలయానికి ఆదాయం కూడా సమకూరేదని పలువురు పేర్కొంటున్నారు.

# నిల్వలు కన్పిస్తున్నా.. బిల్లుల నిలుపుదల

ఖమ్మం : గ్రామ పంచాయతీల్లో సర్పంచులు వడ్డీకి డబ్బులు తెచ్చి అభివృద్ధి పనులు పూర్తి చేశారు. బిల్లులు సమర్పించి నెలలు దాటినా చెల్లింపుల ఊసేలేదు. పల్లెల్లో పారిశుద్ధ్యం నిర్వహణ, మొక్కల సంరక్షణకు సంబంధించి నిత్యం వినియోగించే ట్రాక్టర్‌లో డీజిల్ పోయించేందుకు అప్పు పుట్టడంలేదు. ఇక పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇచ్చే పరిస్థితి కన్పించడంలేదు. నిధుల్లేక, బిల్లులు రాక అప్పుల పాలవుతున్నామని ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీల సర్పంచులు గగ్గోలు పెడుతున్నారు. పంచాయతీ ఖాతాల్లో నిల్వలున్నా ఫ్రీజింగ్ పేరుతో నిలిపివేస్తున్నారని వాపోతున్నారు. ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్న ఐదో విడత పల్లె ప్రగతి కార్యక్రమంపై ఇది తీవ్ర ప్రభావం చూపనుంది.

ట్రాక్టర్లకు డీజిల్ లేదు..సిబ్బందికి వేతనాల్లేవ్

గ్రామ పంచాయతీల ట్రాక్టర్లకు రోజూ డీజిల్ పోయించలేక అనేక మంది సర్పంచులు పాట్లు పడుతున్నారు. బిల్లులు చెల్లించడంలేదని పెట్రోల్ బంకుల నిర్వాహకులు డీజిల్ అప్పుపోయటం మానేశారు. మారుమూల గ్రామాల్లో అనధికారికంగా లీటర్‌పై రూ.20 అదనంగా



చెల్లించాల్సి వస్తోందని కొందరు సర్పంచులు వాపోతున్నారు. రోజూ ట్యాంకర్ బిగించి వెవెన్యూ ప్లాంటేషన్ మొక్కలకు నీరు పోస్తున్నారు. నిత్యం ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇలా రోజుకు ఐదు నుంచి పది లీటర్ల డీజిల్ పోయాల్సి ఉంటుంది.

గ్రామ పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లకు ప్రతి నెల వేతనాలు మంజూరు కాని దుస్థితి నెలకొంది. గత మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు సకాలంలో విడుదల కాలేదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెల 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ఆయా గ్రామ పంచాయతీల ఖాతాలకు జనాభా ఆధారంగా లెక్కించి జమ చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు పలు రూపాల్లో జనరల్ ఫండ్ జమ అవుతుంది. పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బు గ్రామాభివృద్ధి పనులకు ఖర్చు చేస్తుంటారు. పంచాయతీ ఖాతాల్లో డబ్బు నిల్వ కనిపిస్తుంది. కానీ ఆ నిధులకు పనులు చేసి చెక్కులు రాసిస్తే అవి పాస్ అవకుండా ఫ్రీజింగ్ చేస్తున్నారు. అనేక మంది సర్పంచులు జిల్లా అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలను కలసి పరిస్థితి వివరిస్తున్నా మార్పులేదు. ఇటీవల బిల్లుల చెల్లింపులో కొంత జాప్యం నెలకొంది. ఉన్నత స్థాయిలో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. గత పది రోజుల నుంచి ప్రాధాన్యతా క్రమంలో బిల్లులు మంజూరు చేస్తున్నారు. మల్టీపర్పస్ వర్కర్లకు మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు విడుదలయ్యాయి. సీసీ రోడ్లు, ఇతర పనుల బిల్లులు ఆయా శాఖల వారికే తెలుస్తుంది. క్రమంగా పరిస్థితి చక్కబడుతుంది. –జూపల్లి హరిప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి, ఖమ్మం

చెక్కులకు చిక్కులు..

రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, శ్మశానవాటికలు, సెగ్రిగేషన్ షెడ్స్, ఉపాధి హామీ పథకంలో సిమెంటు రోడ్లు, నర్సరీల్లో మొక్కలు పెంచే పనులు సర్పంచులే చేయాలని ప్రభుత్వం, అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. పంచాయతీ, మండల పరిషత్‌ల సాధారణ నిధులు, జడ్పీ నిధులు సహా ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో పూర్తి చేసిన పలు రకాల అభివృద్ధి పనులు, రోజు వారీ పారిశుధ్య పనులకు సర్పంచులు సొంతంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. చేసిన పనులకు బిల్లులు చేయించి చెక్కులు రాసి సబ్ ట్రెజరీ కార్యాలయానికి పంపితే ఫ్రీజింగ్ పేరుతో నెలల తరబడి చెక్కులు పాస్ కావటంలేదు. గత రెండున్నరేళ్లుగా ఇదే పరిస్థితి.సకాలంలో బిల్లుల చెల్లించనందున ట్రాక్టర్లకు బంకుల్లో డీజిల్ పోయటంలేదు. శానిటేషన్ పనులు, వీధి దీపాలు, బ్లీచింగ్, సున్నం కొనుగోలుకు డబ్బు లేదు. పంచాయతీ ఖాతాల్లో నిల్వ కనిపిస్తున్నా, చెక్కులు పాస్ కానందున పనులు చేయలేక పోతున్నాం. దమ్మపేట మండలంలోని 31 పంచాయతీల్లో ఎక్కువ మంది గిరిజన సర్పంచులే ఉన్నారు. బిల్లులు చెల్లించకుంటే ఐదో విడత పల్లె ప్రగతి పనులకు దూరంగా ఉండాలని నిర్ణయించాం.

–కొర్సా సాగర్, దమ్మపేట మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు

## భోజనం పట్టు.. కొలువు కొట్టు

ఖమ్మం :పోలీసు కొలువే లక్ష్యంగా పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్న పట్టుదలతో సాగుతున్న యువతకు ఖమ్మం పోలీస్ కమిషనర్ ఆదేశాలతో 400 మందికి ఉచిత శిక్షణతోపాటు భోజనం సదుపాయం కల్పించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుంచి వేలాది మంది



నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఉచిత శిక్షణకు ఎంపిక చేశారు. వారికి ఉదయం, శరీర దారుఢ్య శిక్షణ, పరీక్షలతోపాటు హైదరాబాద్, విజయవాడ, వరంగల్, నల్గొండ, ఖమ్మంలోని నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ, పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీరికి ఉదయం టీ, మధ్యాహ్నం భోజనం, అల్పాహారం అందిస్తున్నారు. నిత్య పరీక్షల్లో ప్రోత్సాహక బహుమతులు కూడా అందిస్తున్నారు. ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో మధ్యాహ్న భోజన సమయంలో యువతీయువకులు ఇలా బారులు దీరారు.



# తుని రైలు దహనం కేసు కొట్టివేత

విజయవాడ: తుని రైలు దహనం కేసును విజయవాడ రైల్వే కోర్టు కొట్టివేసింది. 24 మంది సాక్షుల్లో 20 మందిని విచారించిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. రైలు దహనం ఘటనలో ముద్రగడ, దాడిశెట్టి రాజా, నటుడు జీవీ సహా 41 మందిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. వాదనలు పూర్తి అయిన తర్వాత న్యాయస్థానం స్పందిస్తూ.. దర్యాప్తు ప్రక్రియలో, నేరం రుజువు చేయడంలో రైల్వే పోలీసులు విఫలమయ్యారని తెలిపింది. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలను రైల్వే పోలీసులు కోర్టు ముందు ఉంచలేకపోయారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ముగ్గురు రైల్వే అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం కేసును కొట్టివేస్తూ తీర్పు వెల్లడించింది. కాపు రిజర్వేషన్ సాధన కోసం 2016 జనవరి 31న తూర్పుగోదావరి జిల్లా తునిలో సభ నిర్వహించారు. ఆ సందర్భంగా చెలరేగిన హింసాత్మక ఘటనలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ దహనమైంది. అప్పట్లో 41 మందిపై రైల్వే పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే పోలీసు విభాగం, గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్పీ) నమోదు చేసిన పలు కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఆర్పీఎఫ్ కేసు పెండింగ్‌లో ఉంది. రైల్వే చట్టంలోని సెక్షన్లు 146, 147, 153, 174 (ఎ), (సి) కింద అప్పట్లో కేసులు నమోదు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన రైల్వే కోర్టు తాజాగా కేసును కొట్టివేసింది.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కడా... 'సిబ్బంది లేమి' ఉండకూడదు



తాడేపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కడా కూడా సిబ్బంది లేరనే మాట రాకూడదని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారు. అవసరమైన మేరకు ఉండాల్సిన డాక్టర్లు, నర్సులు.. ఇతరత్రా సిబ్బంది ఎక్కడ ఖాళీగా ఉన్న గుర్తించి వెంటనే భర్తీచేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న రిక్రూట్‌మెంట్ బోర్డు వెంటనే వాటికి సంబంధించిన ఖాళీలను భర్తీచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సరిపడా సిబ్బంది ఉంటే సగం సమస్యలు సమసిపోతాయని చెప్పారు. సోమవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం వైయస్ జగన్ వైద్య ఆరోగ్యశాఖపై సమీక్ష నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, ఆర్థికశాఖ కార్యదర్శి కె వి వి సత్యనారాయణ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ జె నివాస్, ఆరోగ్యశ్రీ సీఈఓ ఎం ఎన్ హరీంధిర ప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి మురళీధర్ రెడ్డి, ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ వి రామిరెడ్డి, డైరెక్టర్ (టెక్నికల్) నాడు నేడు ఆర్ మనోహర రెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ బి చంద్రశేఖర్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు

# రాజధానిలో స్థానికేతరులకు ఇళ్ల స్థలాలు.. పిటిషన్లపై హైకోర్టు విచారణ




అమరావతి: ఆర్-5 జోన్‌లో స్థానికేతరులకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవోను సవాల్ చేస్తూ రైతులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. రాజధాని పరిధిలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయకుండా ఇళ్ల పట్టాల పంపిణీపై ప్రభుత్వానికి తొందర ఎందుకని పిటిషనర్లు ప్రశ్నించారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ టిడ్కో ఇళ్లపై ప్రభుత్వం, పిటిషనర్లు ఎలాంటి వివరాలు ఇవ్వలేదని పేర్కొంది. రాజధాని ప్రాంతంలో నిర్మించిన 5వేల టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల వివరాలు, ఇళ్ల మంజూరుకు అనుసరించిన విధివిధానాలను పూర్తి వివరాలతో అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం రేపటికి వాయిదా వేసింది. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన పేదలకైనా రాజధాని అమరావతిలో 1134 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గుంటూరు(550.65ఎకరాలు), ఎన్టీఆర్(583.93 ఎకరాలు) జిల్లా కలెక్టర్లకు భూబదలాయింపు నిమిత్తం సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి ఈఏడాది మార్చి 31న జీవో 45 జారీచేశారు. ఆ జీవోను సవాలు చేస్తూ రాజధాని ప్రాంత రైతులు యు.శివయ్య, కె.రాజేశ్, బెజవాడ రమేశ్‌బాబు, ఆలూరి రాజేశ్, కుర్రా బ్రహ్మ, కట్టా రాజేంద్రవరప్రసాద్ హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఆయా పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టింది.

# రైతుకు కనీస సాంత్వన చేకూర్చలేని ప్రభుత్వం ఎందుకు జగన్?: నారా లోకేశ్



ఎమ్మిగనూరు: తన 'యువగళం' పాదయాత్ర మార్గంలో ఏ రైతును కదిలించినా కష్టాలు, కన్నీళ్లే సమాధానంగా వస్తున్నాయని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. అన్నదాత వద్దకు వచ్చిన కనీస సాంత్వన కూడా చేకూర్చలేని ప్రభుత్వం ఎందుకు జగన్మోహన్‌రెడ్డీ? అని ఆయన నిలదీశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం కడిమెట్ల శివారులో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు ఘోరంగా దెబ్బతింటే ప్రభుత్వం తరఫున పట్టించునే నాథుడే కరవయ్యాడని ఆరోపించారు. రెండెకరాల్లో మొక్కజొన్న వేసేందుకు పెట్టుబడి రూ.50వేలు, కౌలు రూ.40వేలు కలిపి మొత్తం రూ.90వేలు ఖర్చవుతోందని.. ఇప్పటికి కేవలం రూ.9వేల దిగుబడి మాత్రమే వచ్చిందన్నారు. అకాల వర్షాలకు పంట కొట్టుకుపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు మాతృవియోగం






విజయవాడ: విజయవాడ సెంట్రల్ వైసీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. ఆయన తల్లి బాలాత్రిపుర సుందరమ్మ కన్నుమూశారు.

కొన్ని రోజులుగా సుందరమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం సుందరమ్మ తుదిశ్వాస విడిచారు. దీంతో వైసీపీ నేతలు, కార్యకర్తలు మల్లాది విష్ణు ఇంటికి చేరుకుంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలుపుతున్నారు.



## తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజులు..

# వడగళ్లతో కూడిన భారీ వర్షాలు

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో రానున్న 3 రోజులు వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉరుములు, మెరుపులతో గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ఓ ప్రకటనలో పేర్కొంది. పశ్చిమ విదర్భ నుంచి మరత్వాడా, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక మీదుగా దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక వరకు సగటు సముద్రమట్టం నుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తున ద్రోణి అనిశ్చితి కొనసాగుతోందని వాతావరణ శాఖ వివరించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కేరళ, దక్షిణ కర్ణాటక రాష్ట్రాల్లో ఉరుములు, వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్, హరియాణా, మధ్యప్రదేశ్‌లోనూ భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది.




## ఉచిత సిలిండర్లు

# రోజూ అరలీటరు నందిని పాలు

బెంగళూరు: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ కర్ణాటక రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు హామీల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా అధికార భాజపా అసెంబ్లీ ఎన్నికలకు మేనిఫెస్టోను విడుదల చేసింది. రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి అమలు, 10లక్షల ఉద్యోగాలు, పేదలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని కాషాయ పార్టీ హామీలు కురిపించింది. అంతేగాక, ఇటీవల రాష్ట్ర రాజకీయాలను కుదిపేసిన 'నందిని' పాల బ్రాండ్‌ను కూడా భాజపా తన మేనిఫెస్టోలో చేర్చడం గమనార్హం. భాజపా 'ప్రజా ప్రణాళిక' పేరుతో ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. బెంగళూరులో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నడ్డా మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం అందించడం, సంక్షేమం కల్పించడమే భాజపా విజన్ అని తెలిపారు. కాగా.. ప్రతిపక్ష కాంగ్రెస్ ఇంకా తమ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించలేదు.

**భాజపా మేనిఫెస్టోలోని ప్రధాన హామీలివే..** కర్ణాటకలో ఉమ్మడి పౌరస్మృతి అమలు. తయారీ రంగంలో 10 లక్షల ఉద్యోగాల కల్పన. దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాలకు ప్రతి రోజు ఉచితంగా అర లీటరు నందిని పాలు. పేద కుటుంబంలోని ప్రతి వ్యక్తికి 5 కేజీల బియ్యం, 5 కేజీల తృణధాన్యాలతో నెలవారీ రేషన్ కిట్. దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాలకు ఏటా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు (ఉగాది, వినాయక చవితి, దీపావళికి ఒక్కోటి చొప్పున ఇస్తాం). కర్ణాటక యాజమాన్య చట్టం సవరింపు, ప్రతి వార్డుకో లాబొరేటరీ. మైసూరులోని ఫిల్మ్ సిటీకి దివంగత నటుడు పునీత్ రాజ్‌కుమార్ పే రు. ప్రతి వార్డులో అటల్ ఆహార కేంద్రాలు. నిరాశ్రయులకు 10 లక్ష ల ఇళ్ల స్థలాల కేటాయింపు. వృద్ధులకు ఉచితంగా వార్షిక హెల్త్ చెక ప్‌లు. బెంగళూరుకు స్టేట్ క్యాపిటల్ రీజియన్ ట్యాగ్. ఎస్సీ, ఎస్టీ మ హిళలకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం. రూ.30వేల కోట్లతో మైక్రో కోల్డ్ స్టోరేజీ సదుపాయాల కల్పన. రూ.1500 కోట్లతో పర్యాటక రంగ అభివృద్ధి.



## శిఖరంలాంటి వ్యక్తిత్వం..

# రజనీపై విమర్శలా?

అమరావతి: ఎన్టీఆర్ శతజయంతి కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌స్టార్ రజనీకాంత్‌పై వైకాపా నేతల విమర్శలను తెదేపా అధినేత చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. తీవ్ర అహంకారంతో అధికారపార్టీ నేతలు చేస్తున్న అర్థం లేని విమర్శలను తెలుగు ప్రజలెవరూ సహించరన్నారు. ఈ మేరకు చంద్రబాబు ట్వీట్ చేశారు. "అన్న గారి శత జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయనతో తన అనుబంధాన్ని.. అనుభవాలను పంచుకున్న సూపర్‌స్టార్ రజనీకాంత్‌పై వైకాపా మూకల అసభ్యకర విమర్శల దాడి అభ్యంతరకరం, దారుణం. సమాజంలో ఎంతో గౌరవం ఉండే రజనీ లాంటి లెజెండరీ పర్సనాలటీపై కూడా వైకాపా నేతలు చేస్తున్న నీచ వ్యాఖ్యలు అందరికీ బాధ కలిగిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వ పోకడలపై ఆయన చిన్న విమర్శ కూడా చేయలేదు.. ఎవరినీ చిన్న మాట అనలేదు. పలు అంశాలపై రజనీ కేవలం తన అభిప్రాయాలు పంచుకున్నారు. అయినా తీవ్ర అహంకారంతో ఆయనపై చేస్తున్న అర్థం లేని విమర్శలను తెలుగు ప్రజలు ఎవరూ సహించరు. శిఖరం లాంటి వ్యక్తిత్వం కలిగిన రజనీ క్యారెక్టర్‌పై వైకాపా నేతల విమర్శలు ఆకాశంపై ఉమ్మి వేయడమే. నోటి దురుసు గల నేతలను జగన్ అదుపులో పెట్టుకోవాలి. జరిగిన దానికి క్షమాపణ చెప్పి తమ తప్పు సరిదిద్దుకోవాలి" అని చంద్రబాబు డిమాండ్ చేశారు.



# పీఏ చెంప చెళ్లుమనిపించిన వైకాపా ఎమ్మెల్యే

అచ్యుతాపురం: తన వద్ద పనిచేస్తున్న వ్యక్తిగత సహాయకుడు (పీఏ)పై వైకాపా ఎమ్మెల్యే చేయిచేసుకున్నారు. ఈ ఘటన అనకాపల్లి జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అచ్యుతాపురం మండలంలోని మత్స్యకార గ్రామం పూడిమడకలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో సొంత పార్టీకే చెందిన మంత్రి అమర్‌నాథ్ వర్గీయులు ఎమ్మెల్యేను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఏపీఐఐసీ పైపులైన్ ప్యాకేజీ ఇప్పించడంతో పాటు గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మత్స్యకార యువతకు ఉపాధి కల్పించాలంటూ ఎమ్మెల్యేను అడ్డుకునే ప్రయత్నం చేస్తూ గోబ్యాక్ నినాదాలు చేశారు. సొంత పార్టీ నేతలే నిలదీయడంతో ఎమ్మెల్యే ఆగ్రహానికి గురయ్యారు. దీంతో వారిపైకి కన్నబాబురాజు దూసుకెళ్లే ప్రయత్నం చేయగా.. పీఏ నవీన్‌వర్మ ఆయన చేయి పట్టుకుని వెనక్కిలాగారు. దీంతో తీవ్ర అసహనానికి గురైన ఎమ్మెల్యే.. పీఏ చెంప చెళ్లుమనిపించారు. అనంతరం పోలీసుల జోక్యంతో సొంతపార్టీ నేతల నిరసనల మధ్యే కార్యక్రమం యథావిధిగా కొనసాగింది.

**గతంలోనూ ఎమ్మెల్యే దురుసు ప్రవర్తన..** గతంలో తనకు విద్యాదీవెన పథకం మంజూరు కాలేదని తెలిపిన విద్యార్థిపై ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించారు. కొద్దిరోజుల క్రితం మునగపాక మండలం నాగులాపల్లిలో 'గడప గడపకు' కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించారు. మళ్ల శంకర్ అనే వ్యక్తి ఇంటి వద్దకెళ్లి ఆయన కుమార్తెను అమ్మఒడి పథకం అందిందామ్మా? అని ప్రశ్నించారు. అందిందని ఆమె తెలిపింది. తాను ఐటీఐ పూర్తిచేశానని విద్యాదీవెన మంజూరు కాలేదని శంకర్ కుమారుడు శివాజీ ఎమ్మెల్యేకు తెలిపాడు. నువ్వు చదువుకున్న పాఠశాల యాజమాన్యానికి మంజూరైందని ఎమ్మెల్యే వివరించారు. వాళ్లకు మంజూరైనప్పుడు తనకు చెప్పడమెందుకని యువకుడు ఎదురు ప్రశ్నవేశాడు. దీంతో ఎమ్మెల్యే కన్నబాబు తీవ్రంగా స్పందిస్తూ పథకం మంజూరై కూడా ఎదురు ప్రశ్నవేస్తావా? ఇక్కడి నుంచి వెళ్లు అంటూ ఆ విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లకోసం మళ్లీ మా వద్దకు రారా అని శివాజీ ఎదురు సమాధానం చెప్పేసరికి మరింత ఆగ్రహించిన ఎమ్మెల్యే 'ఎవరితో మాట్లాడుతున్నావ్. పళ్లు పీకేస్తా'అంటూ విద్యార్థిపైకి దూసుకువెళ్లారు. ఎమ్మెల్యే ప్రవర్తన అప్పట్లో చర్చనీయాంశమైంది.

# బ్లాక్ డ్రెస్ లో డార్క్ ఏంజిల్ గా మృణాల్ ఠాకూర్

సీతారామం సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ మృణాల్ ఠాకూర్. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే నటిగా తన పెర్ఫార్మెన్స్ తో ప్రశంసలు సొంతం చేసుకుంది. కెరియర్ లో మరిచిపోలేని సక్సెస్ ను సొంతం చేసుకుంది. సీతారామం సినిమా ఈ దశాబ్దంలో వచ్చిన క్లాసిక్ మూవీ అనే గుర్తింపుని సొంతం చేసుకోవడంతో మృణాల్ కి అన్ని పాన్ ఇండియా ఇమేజ్ ని అందించింది. ఇదిలా ఉంటే ఈ మూవీ తర్వాత నేచురల్ స్టార్ నానికి జోడీగా మృణాల్ నటించబోతోంది. ఈ మూవీ షూటింగ్ స్టార్ట్ అయ్యింది. సినిమాలలో కాస్తా పద్ధతైన పాత్రలలో నటించే హీరోయిన్స్ అందరూ బయట అంతే పద్ధతి ఉంటారని మాత్రం అనుకోకూడదు.



మృణాల్ ఠాకూర్ కూడా అంతే. ఈ బ్యూటీ బయట అల్ట్రా మోడ్రన్ గానే ఎక్కువగా కనిపించడానికి ఇష్టపడుతుంది. ట్రెడిషనల్ కాస్ట్యూమ్స్ లో కంటే వెస్ట్రన్ వేర్స్ లోనే ఎక్కువగా కనిపించడానికి ఆసక్తి చూపిస్తుంది. అలాగే సిల్వర్ స్క్రీన్ పై కమర్షియల్ హీరోయిన్ గా సక్సెస్ కావాలంటే అందాల ప్రదర్శన చేయాల్సిందే అనే విషయాన్ని ఈ అమ్మడు బలంగా నమ్ముతుంది. అందుకే రెగ్యులర్ గాహాట్ హాట్ ఫోటో షూట్ లతో ఇంస్టాగ్రామ్ లో సెగలు రేపుతూ ఉంటుంది. మిగిలిన బాలీవుడ్ భామల తరహాలోనే మృణాల్ ఠాకూర్ కూడా ఎక్కువగా ఫోటో షూట్ లు చేస్తూ తనని తాను షోకేస్ చేసుకుంటూ ఉంటారు. ఈ మధ్య గ్లామర్ డోస్ మరింత పెంచి అందాల ప్రదర్శనని మృణాల్ ఠాకూర్ చేస్తూ ఉన్నారు. తాజాగా ఈ అమ్మడు బ్లాక్ కలర్ డ్రెస్ లో కెమెరా లైటింగ్ లో కలర్ ఫుల్ గా మెరిసిపోతోంది. బ్యాక్ నుంచి ఎద అందాలు చూపిస్తూ రెచ్చగొడుతుంది. ఈ ఫోటోలు ఇప్పుడు వైరల్ గా మారాయి. మృణాల్ ఠాకూర్ షేర్ చేసిన ఈ ఫోటోలని 4 నిమిషాల్లో ఏకంగా 1.43 లక్షల మంది లైక్ చేయడం విశేషం. ఈ ఫోటోలలో మృణాల్ బ్లాక్ ఏంజిల్ లా మెరిసిపోతుంది అనేమాట నెటిజన్ల నుంచి వినిపిస్తోంది.

## బాత్ రూంలో స్నాక్స్ తినేదాన్ని..!

బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా మెప్పించిన ప్రియాంక చోప్రా ఆ తర్వాత హాలీవుడ్ సినిమాలు మరియు సిరీస్ ల్లో నటించి పాపులారిటీని సొంతం చేసుకుని గ్లోబల్ స్టార్ గా మారిన విషయం తెల్సిందే. హీరోయిన్ గా ప్రియాంక చోప్రా కు ప్రస్తుతం పాన్ వరల్డ్ గుర్తింపు ఉంది. హాలీవుడ్ సిరీస్ ల ద్వారా స్టార్ ఇమేజ్ దక్కించుకున్న ప్రియాంక చోప్రా పూర్తిగా అమెరికాలోనే సెటిల్ అయ్యింది. అమెరికన్ సింగర్ నిక్ జోనస్ ను వివాహం చేసుకున్న ప్రియాంక చోప్రా అక్కడే ఉంటుంది. ప్రస్తుతం అక్కడ నివాసం ఉంటున్న ప్రియాంక చోప్రా



ఒకప్పుడు చదువుకు నేందుకు వెళ్లిన సమయంలో అక్కడ చాలా కష్టాలు ఎదుర్కొన్నట్లు ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రియాంక చోప్రా నటించిన ఒక వెబ్ సిరీస్ ప్రమోషన్ లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో.. హై స్కూల్ విద్య కోసం అమెరికా వెళ్లాను. వెళ్లిన కొత్తలో తాను చాలా ఇబ్బందులు పడ్డాను. ముఖ్యంగా అక్కడి వారితో ఎలా మెలగాలో తెలియక ఒంటరితనం ఎదుర్కొన్నాను. అక్కడ ఎవరు పరిచయం అవ్వక పోవడంతో రకరకాలుగా భయాలు ఉండేవి. క్యాంటీన్ కు వెళ్లి ఫుడ్ ఎలా తీసుకోవాలో తెలిసేది కాదు. దాంతో వెండింగ్ మిషన్ లో స్నాక్స్ ను తీసుకుని వాటిని బాత్ రూం లో కూర్చుని తినేసి ఆ తర్వాత క్లాస్ కు వెళ్లే దాన్ని.

చాలా రోజుల పాటు నాకు వేరే వారితో పరిచయం అవ్వక పోవడంతో ఒంటరిగానే ఉండేదాన్ని. నాలుగు వారాల తర్వాత ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఆ తర్వాత స్కూల్ లో పరిచయం చేసుకోవడం మొదలు పెట్టాను. కొందరు స్నేహితులు లేట్ నైట్ పార్టీలని.. పబ్ లంటూ వెళ్లే వారు. వారితో పాటు నన్ను పిలిచినా కూడా మా ఫ్యామిలీ లో అలాంటివి ఒప్పుకోరు అంటూ వాటిని తప్పించుకునేదాన్ని అంటూ ప్రియాంక చోప్రా పేర్కొంది. ఒకప్పుడు మొహమాటంతో ఇబ్బంది పడ్డ పీసీ ఇప్పుడు తన నటనతో పాన్ వరల్డ్ గుర్తింపు దక్కించుకున్న విషయం తెల్సిందే.




# వయసులో ఆ ఫీట్స్ ఏంటి మేడం?



హీరోయిన్ గా ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించిన జ్యోతిక తమిళ హీరో సూర్యను వివాహం చేసుకున్న తర్వాత ఇండస్ట్రీకి దూరం అయిన విషయం తెల్సిందే. పిల్లలు పెద్ద వారు అవ్వడంతో పాటు భర్త ప్రోత్సాహంతో జ్యోతిక మళ్లీ సినిమాల్లో రీ ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. చాలా గ్యాప్ తర్వాత రీ ఎంట్రీ ఇచ్చినా కూడా జ్యోతికకి మంచి కమ్ బ్యాక్ దక్కింది. ఆమె ఎక్కువగా లేడీ ఓరియంటెడ్ సినిమాలను చేస్తున్న విషయం తెల్సిందే. ఇంట్రెస్టింగ్ కథలను ఎంపిక చేసుకుని సినిమాలు చేస్తున్న జ్యోతిక వరుసగా సక్సెస్ లను దక్కించుకుంది. ఈ సమయంలోనే జ్యోతిక తన ఫిజిక్ పై చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జ్యోతిక వయసు ప్రస్తుతం ఇంటర్నెట్ అనుసారం 44 సంవత్సరాలు. సాధారణంగా ఈ వయసులో హీరోయిన్స్ గా ఆఫర్లు రావడం అనేది చాలా తక్కువ... సౌత్ లో ఈ వయసు వచ్చే వరకు హీరోయిన్ గా కంటిన్యూ అవ్వడం దాదాపు అసాధ్యం కానీ జ్యోతిక మాత్రం ఇంకా లేడీ ఓరియంటెడ్ సినిమాలతో హీరోయిన్ గా కంటిన్యూ అవుతున్న విషయం తెల్సిందే. తన సినిమాల కోసం జ్యోతిక చేస్తున్న వర్కౌట్స్ షాకింగ్ గా ఉన్నాయి. తాజాగా ఆమె షేర్ చేసిన ఒక వీడియో చూసి చాలా మంది షాక్ అవుతున్నారు. సింగిల్ హ్యాండ్ పై బ్యాలన్స్ చేయడం తో పాటు హీరోలకు సైతం సాధ్యం కాని కొన్ని ఫీట్స్ ను చేస్తూ అబ్బుర పర్చుతోంది. బాబోయ్ అంటూ చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఉన్నారు. ఇంత కష్టం ఏ సినిమా కోసం అంటూ కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే.. మీరు ఈ స్థాయిలో వర్కౌట్స్ చేస్తే కొత్త హీరోయిన్స్ ఫిజిక్ విషయంలో సిగ్గుతో తల దించుకుంటారేమో అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి జ్యోతిక వర్కౌట్స్ వీడియో వైరల్ అవుతోంది.

# షూటింగ్ టైం పిక్.. శోభిత ఇలా షాక్ ఇచ్చిందేంటి..!





తెలుగు అమ్మాయే అయినా శోభిత ధూళిపాల బాలీవుడ్ సినిమాలు చేస్తూ అక్కడ కల్చర్ ని అలవాటు చేసుకుంది. సినిమాలే కాదు ఫోటో షూట్స్ లో కూడా బాలీవుడ్ భామలను మించి అనిపించేస్తుంది. అమ్మడు ఈమధ్య సౌత్ సినిమాల్లో కనిపిస్తుంది. అడివి శేష్ సినిమాలతో తెలుగు ఆడియన్స్ ని అలరిస్తున్న శోభిత మణిరత్నం తెరకెక్కించిన పొన్నియిన్ సెల్వన్ సినిమాలో కూడా అలరించింది. సినిమాలో వానాతి రోల్ లో నటించింది శోభిత. ఎప్పుడు వెస్ట్రన్ వేర్ తో అలరించే అమ్మడు ఈ సినిమాలో మాత్రం నిండుగా కనిపించింది. అఫ్కోర్స్ శోభితని అలా చూసిన ఆడియన్స్ ఈ కాస్ట్యూమ్స్ లో అమ్మడు అదిరిపోయిందని అంటున్నారు. సినిమా ఫలితం ఎలా ఉన్నా పిఎస్ 1 2 ఆ సినిమాలో నటించిన వారందరికి మంచి వర్కింగ్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది. ఇక పొన్నియిన్ సెల్వన్ రిలీజ్ తర్వాత ఆ సినిమా షూటింగ్ లాస్ట్ డే శోభిత చేసిన అల్లరిని లేటెస్ట్ గా తన ఇన్ స్టాగ్రామ్ లో పెట్టింది. తన కాస్ట్యూమ్ తో కనిపించిన అమ్మడు పక్కన ఐశ్వర్య లక్ష్మితో కలిసి స్టెప్పులు వేస్తుంది. మళ్లీ ఆ డ్రెస్ లో తమని తాము చూసుకోవడం కష్టమని భావించి ఫోటోలు వీడియోలు తీసేసుకున్నారు. అయితే రిలీజ్ ముందు పెడితే క్యారెక్టర్ తెలిసిపోతుందని అనుకున్నారో ఏమో కానీ పిఎస్ 2 తర్వాత ఈ ఫోటోలు షేర్ చేసింది. ప్రస్తుతం శోభిత షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. సినిమాల పరిస్థితి ఎలా ఉన్నా అమ్మడు టాలీవుడ్ హీరోతో డేటింగ్ లో ఉందన్న వార్తలు మాత్రం ఆమెను హైలెట్ చేస్తున్నాయి. అక్కినేని నాగ చైతన్యతో శోభిత రిలేషన్ పై రకరకాల వార్తలు వస్తున్నాయి. అయితే వీటిపై శోభిత మాత్రం పెదవి విప్పింది లేదు. పిఎస్ 2 ప్రమోషన్స్ టైం లో కూడా తన డేటింగ్ వార్తలపై ప్రశ్నలు రాకుండా జాగ్రత్త పడింది. ఏది ఏమైనా శోభిత సందడి ఈమధ్య తెలుగు ఆడియన్స్ ని అలరిస్తుందని చెప్పొచ్చు.

# బిగ్ బాస్ పిల్ల.. నిక్కరులో హీటెక్కించిందిగా..

బిగ్ బాస్ రియాల్టీ షో ద్వారా చాలామంది అందాల భామలు సెలబ్రెటీ ఇమేజ్ సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా తెలుగులో అయితే సోషల్ మీడియాలో పాపులర్ అయిన బ్యూటీస్ బిగ్ బాస్ లోకి అడుగుపెట్టి విపరీతమైన క్రేజ్ దక్కించుకున్నారు. అక్కడ నుంచి వచ్చిన తర్వాత అదే పాపులరిటీతో రియాలిటీ షోలలో పార్టిసిపేట్ చేస్తూ మరింత ఫేమ్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక హీరోయిన్ గా సక్సెస్ కావాలని ప్రయత్నం చేస్తున్న అందాల భామలు తమలోని హాట్ నెస్ ని బయటకు తీసుకొస్తున్నారు. తెలుగు అమ్మాయిలు అయినా కూడా ఏ మాత్రం తగ్గకుండా గ్లామర్ డోస్ తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆషు రెడ్డి అరియానా గ్లోరీ తర్వాత ఆ స్థాయిలో ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ గా మారిన మరో బ్యూటీ శ్రీ సత్య. సీరియల్స్ లో నటిగా కెరియర్ ప్రారంభించిన



ఈ అమ్మడు తర్వాత గత ఏడాది బిగ్ బాస్ రియాల్టీ సోలో పార్టిసిపేట్ చేశారు. అక్కడ అందరి దృష్టిని ఆకర్షించి సెలబ్రిటీ ఇమేజ్ సొంతం చేసుకుంది. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ బ్యూటీకి మంచి అవకాశాలు వస్తున్నాయి అనే మాట వినిపిస్తోంది. తెలుగు టెలివిజన్ రియాలిటీ షో షోలలో కూడా పార్టిసిపేట్ చేస్తూ అందరి దృష్టిని ఆకస్తున్నారు. ఈ అమ్మడు గ్లామర్ డోస్ విషయంలో కూడా కాస్త స్పీడ్ పెంచింది అని చెప్పాలి. ఎక్కువగా షార్ట్స్ లో కనిపిస్తూ థైస్ అందాలు చూపిస్తే కుర్రాలను రెచ్చగొడుతుంది. శ్రీ సత్య థైస్ అందాలకు సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్స్ కూడా ఉన్నారు. తాజగా ఈ బ్యూటీ ఇంస్టాగ్రామ్ లో మరోసారి హాట్ ఫోటోని షేర్ చేశారు. ఈ ఫోటో ఇప్పుడు వైరల్ గా మారింది. ఒక కుర్చీలో కూర్చుని మరో కుర్చీపై కాళ్ళు పైకి పెట్టి నిండైన ఆమె థైస్ అందాలు తనువితేరా చూపిస్తుంది. ఈ అందాలని చూస్తున్న కుర్రాళ్ళ గుండెలలో సెగలు రేగుతున్నాయి. ఈ స్థాయిలో రెచ్చగొడుతూ ఉంటే తట్టుకోవడం కష్టం అనే మాట వినిపిస్తోంది.

## ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్ తో రాశీఖన్నా శృంగారం!

థాంక్యూ తర్వాత రాశీఖన్నా కోలీవుడ్..బాలీవుడ్ చిత్రాలపైనే దృష్టి పెట్టింది. టాలీవుడ్ కెరీర్ ఆశించిన విధంగా లేకపోవడంతో! అమ్మడు ఇక ఇక్కడ లాభం లేదనుకుని ఇతర భాషల్నే టార్గెట్ చేసింది. ఆ రకంగా అవకాశాలు బాగానే అందికుంటుంది. ప్రస్తుతం తమిళ్..హిందీలో కలిపి నాలుగైదు సినిమాలు చేస్తుంది. ఇందులో యోధ మాత్రం అమ్మడికి మెమోరిబుల్ మూవీగా నిలిచిపోతుందనే వార్తలొస్తున్నాయి. ఈ సినిమా కోసం అమ్మడు అన్ని రకాలుగా సిద్ధపడినట్లు తెలుస్తోంది. ఇందులో రాశీకి జోడీగా సిద్దార్థ్ మల్హోత్రా నటిస్తున్నాడు. రాశీతో పాటు దిశా పటానీ మరో హీరోయిన్ గా నటిస్తుంది. విమానం హైజాక్ నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇందులో సిద్దార్థ్ ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నాడు. స్టోరీలో






భాగంగా సినిమాలో రొమాంటిక్ సన్నివేశాలు హద్దు మీరే ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సినిమాలో రాశీఖన్నా శృంగార సన్నివేశాల్లో ఏ మాత్రం తగ్గలేదు అన్న టాక్ బాలీవుడ్ మీడియాలో హల్చల్ చేస్తుంది. ఎగిరే విమానంలో సిద్దార్థ్ ఘాటైన సన్నివేశాల్లో నటించిందిట. హాలీవుడ్ సినిమా తరహాలో హీరో–హీరోయిన్ మధ్య ఇంటిమేట్ సన్నివేశాలు ఆసక్తి కట్టిస్తాయని వినిపిస్తుంది. బెడ్ రూమ్ సన్నివేశాల్ని మించి కొన్ని సన్నివేశాలు ఉన్నాయని అంటున్నారు. ఇలాంటి సన్నివేశాలు రాశీఖన్నాకి కొత్తేం కాదు. కెరీర్ ఆరంభంలో మడి కట్టుకుని కుర్చున్న ఆ తర్వాత రౌడీ స్టార్ విజయ్ దేవరకొండతో వరల్డ్ ఫేమస్ లవర్ లో ఏ రేంజ్ లో నటించిందో తెలిసిందే. అందులో బెడ్ రూమ్ సన్నివేశాల్లో రాశీ పెర్ఫార్మెన్స్ తో విజిల్స్ వేయించింది. స్టోరీ డిమాండ్ లో భాగంగా ఆ రకమైన సన్నివేశాలు వస్తున్నప్పుడల్లా థియేటర్ దద్దరిల్లింది. ఇక బాలీవుడ్ సినిమాలో రియాల్టీ కోసం మరింత అడ్వాంటేజ్ తీసుకుంటారు. ఈ నేపథ్యంలో యోధలో రాశీ రొమాంటిక్ సన్నివేశాలపై ఇప్పటి నుంచి ఆసక్తి మొదలైంది. ఇప్పటికే సిద్దార్థ్ మల్హోత్రాకి రొమాంటిక్ స్టార్ గా మంచి పేరుంది. రాశీఖన్నాతోనూ రొమాన్స వర్కౌట్ అయితే! ఆ ఇమేజ్ రెట్టింపు అవుతుంది.



# జంటనగరాల ప్రజలకు శుభవార్త చెప్పిన సీఎం కేసీఆర్..

## ఇండ్ల క్రమబద్ధీకరణ మరో నెల రోజులు గడువు పొడిగింపు..!

హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాల పరిధిలోని మున్సిపాలిటీ పరిధిలోని పేదల ఇండ్ల నిర్మాణానికి ఇబ్బందులు లేకుండా.. నిబంధనల మేరకు ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరించి, న్యాయమైన హక్కులను కల్పించినట్లు సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు నోటరీ స్థలాలను జీవో 58-59 ప్రకారం క్రమబద్ధీకరించుకునేందుకు మరో నెల రోజులు గడువు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తక్షణమే తమ తమత నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలను కలిసి తమకున్న నోటరీ తదితర ఇండ్ల స్థలాల రెగ్యులేషన్ సమస్యలను తెలుపుకోవాలని సూచించారు. అన్ని సమస్యలను క్రోడీకరించి, పరిష్కరించి, వారికి న్యాయపరమైన హక్కులతో కూడిన పట్టాలను ప్రభుత్వం అందజేస్తుందని సీఎం తెలిపారు. ఏకకాలంలో ఒకే మొత్తంలో పేదల ఇండ్ల సమస్యలు పరిష్కారం కావాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే సందర్భంలో వ్యవసాయ భూముల నోటరీ సమస్యలను కూడా పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. త్వరలోనే ఇందుకు సంబంధించి కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల పరిధిలోని ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి జీవో 58-59 గడువును పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందించారు. మరో నెల రోజుల గడువు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, నవీన్ కుమార్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మాగంటి గోపినాథ్, దానం నాగేందర్, మాధవరం కృష్ణారావు, జాజుల సురేందర్, ఆత్రం సక్కు, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ఉన్నారు.

# వానాకాలంలో కోటి 40 లక్షల ఎకరాల్లో సాగు : మంత్రి నిరంజన్ రెడ్డి



హైదరాబాద్ : రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయంలో వ్యవసాయ శాఖపై తొలి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులకు అందుబాటులో ఉంటూ విలువైనా సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ వానాకాలంలో కోటి 40 లక్షల ఎకరాలలో సాగు అంచనా వేస్తున్నామన్నారు. మరో 14 లక్షల ఎకరాలలో ఉద్యాన పంటల సాగుకు అవకాశముందని వెల్లడించారు. అందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ సమాయత్తం కావాలని సూచించారు. సేంద్రీయ సాగు, భూసారాన్ని దృష్టిలో ఉంచుకుని పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి రూ. 76.66 కోట్లు నిధుల విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ అవసరాలలో డ్రోన్ వినియోగంపై యువతకు అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటల సాగుకై డీసీసీబీల ద్వారా ఎకరానికి రూ. 40 వేలు వరకు పంటరుణాలు అందించాలని చెప్పారు.

**వరి సీజన్‌ను ముందుకు జరపాలి** : బాన్సువాడ, బోధన్, హుజూర్ నగర్, మిర్యాలగూడల మాదిరిగా వరి సాగు సీజన్ ముందుకు జరపాలని అధికారులకు మంత్రి వివరించారు. మార్చి చివరి వరకు యాసంగి కోతలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటే వడగళ్ల వానల నుంచి నష్టాన్ని నివారించవచ్చని సూచించారు. తక్కువ కాలంలో అధిక దిగుబడులు ఇచ్చే నూతన వరి వంగడాలను రైతులకు అందేలా చూడాలన్నారు. నకిలీ విత్తన పంపిణీ దారులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు కొండబాల కోటేశ్వర్ రావు, మార గంగారెడ్డి, కొండూరు రవీందర్ రావు, సాయిచంద్, తిప్పన విజయసింహారెడ్డి, మచ్చా శ్రీనివాస్ రావు, రాజావరప్రసాద్ రావు, రామకృష్ణారెడ్డి, ఉద్యానశాఖ డైరెక్టర్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య ప్రజలకి ప్రవేశం ఉందా... లేదా?



హైదరాబాద్ : సుమారు రూ. 1,000 కోట్ల ప్రజల సొమ్ముతో నిర్మించినట్టు చెబుతున్న తెలంగాణ నూతన సచివాలయంలో ఆ సామాన్య ప్రజలకి ప్రవేశం ఉందా... లేదా? అనేది ఇప్పుడొక మిలియన్ డాలర్ క్వశ్చన్‌గా మారిందని బీజేపీ నాయకురాలు విజయశాంతి పేర్కొన్నారు. ఫేస్‌బుక్ వేదికగా ఆమె నూతన సచివాలయంపై స్పందించారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అధికార నివాసంలో గాని, సచివాలయంలోగాని గత సీఎంలు, మంత్రులు ప్రజల్ని కలుసుకోవడం, వారి సమస్యల్ని ఆలకించి సత్వర పరిష్కారాలు సూచించడం తరచుగా కనిపించేదని వెల్లడించారు. ఇంకా రాములమ్మ మాట్లాడుతూ.. " తెలంగాణ వచ్చి కేసీఆర్ గారు సీఎం అయ్యాక ప్రగతి అంతా ప్రగతిభవన్‌కి, ఎర్రవల్లి ఫాంహౌస్‌కి మాత్రమే పరిమితమై ప్రజలు అధోగతి పాలయ్యారు. ఇంకా మంత్రులు సైతం ఆయన బాటలోనే నడిచి ప్రజలకు దూరమయ్యారు. గత తొమ్మిదేళ్లుగా అటు ప్రగతి భవన్‌లో గాని, నాటి సచివాలయంలో గాని ప్రజలకు ముఖం చూపించని కేసీఆర్ గారు ఇప్పుడు కట్టించిన ఈ కొత్త సచివాలయంలోనైనా ప్రజలకు అందుబాటులోకి వస్తారా... ప్రజల్ని లోపలికి రానిస్తారా? అనేది అటు మీడియాలోను, జనసామాన్యంలోను చర్చనీయాంశంగా మారింది. పేద ప్రజల త్యాగాల, కష్టాల, ఉద్యమాల స్వార్జితమైన మన తెలంగాణ రాష్ట్రం ఎందుకో మరల అహంకార, నియంతృత్వ విధాన స్థితికి తీసుకెళ్లబడుతూ మరోపక్క అప్పుల రాష్ట్రం చెయ్యబడుతున్నదని అర్థం అయ్యేట్లు ప్రజలకు చెప్పవలసిన బాధ్యత మనకు ఉందనేది వాస్తవం" అని పేర్కొన్నారు.

తెలంగాణ కొత్త సచివాలయం ఉద్యోగులతో కలకలలాడు తోంది. ఉద్యోగులంతా డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయం బాట పట్టారు. తొలిరోజు కావడంతో సచివాలయ ద్వారం వద్ద సందడి వా తావరణం నెలకొంది. ఇవాల్టి నుంచి కొత్త సచివాలయంలోనే ఉద్యోగులు విధులు నిర్వహించనున్నారు. ఉద్యోగి ఐడీ కార్డ్ చూసి లోపలికి భద్రత సిబ్బంది అనుమతి ఇస్తున్నారు. అయితే తొలిరోజు కావడంతో ఉద్యోగులు కాస్త గందరగోళంగా ఉన్నారు. మరోవైపు.. ఏ గేట్ నుంచి లోపలికి వెళ్ళాలో అర్థంకాక సచివాలయం చుట్టూ ఉద్యోగులు, పైలెట్ వాహనాలు తిరుగుతున్నాయి. మరికొందరు ఉద్యోగులు అరగంట నుంచి సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. సూచికలు లేకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. మంత్రులు హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ఇవాళ ఉదయాన్నే సచివాలయంకు చేరుకున్నారు. మరికొందరు మంత్రులు ఇప్పుడిప్పుడే సచివాలయానికి చేరుకుంటున్నారు.




# మౌనిక కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించిన మంత్రి తలసాని

హైదరాబాద్ : చిన్నారి మౌనిక మృతి ఘటన చాలా బాధాకరమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గత నెల 29వ తేదీన సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని కళాసిగూడ నాలాలో పడి మరణించిన చిన్నారి మౌనిక కుటుంబానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 5 లక్షల ఆర్థిక సహాయం చెక్కును మంత్రి తలసాని సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు వారి నివాసంలో అందజేశారు. తమ బిడ్డను తలుచుకుంటూ రోదిస్తున్న మౌనిక తల్లిదండ్రులు శ్రీనివాస్, రేణుకలను మంత్రి ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. అభంశుభం తెలియని చిన్నారి మృతి ప్రతి ఒక్కరినీ ఎంతో కలచి వేసిందని చెప్పారు. ఎంత చేసినా చిన్నారి లేని లోటును ఆ కుటుంబానికి తీర్చలేనిదని పేర్కొన్నారు.

కడు పేదరికంలో ఉన్న మౌనిక కుటుంబం అవసరాలను తెలుసుకొని వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నగరంలో కోట్లాది రూపాయాల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఎన్నో సంవత్సరాల నుండి ఉన్న వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం చేపట్టి నాలాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగా నే పలు కాలనీలు, బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న వరద సమస్యను పరిష్కరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, %జుజు% సుదర్శన్, స్థానిక నాయకులు ఆంజనేయులు, విజయ్, భాస్కర్, జగత్ రావు తదితరులు ఉన్నారు.



# సచివాలయానికి గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ సర్టిఫికెట్..

## ఈ ఘనత పొందిన తొలి సెక్రటేరియట్‌గా రికార్డు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌కు గ్రీన్ బిల్డింగ్ ఇండియా కౌన్సిల్ గోల్డ్ సర్టిఫికెట్ దక్కింది. పర్యావరణహితంగా గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలు పాటించినందుకు సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది. భారత్‌లో గోల్డ్ రేటెడ్ సర్టిఫికెట్ పొందిన తొలి సెక్రటేరియట్ బిల్డింగ్ కాంప్లెక్స్‌గా ఘనత సాధించింది. ఈ మేరకు సోమవారం సెక్రటేరియట్‌లో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ చైర్మన్ శేఖర్‌రెడ్డి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి అవార్డును అందించారు. సచివాలయానికి సర్టిఫికెట్ రావడంపై మంత్రి వేముల హర్షం వ్యక్తం చేశారు. అత్యంత విశాలంగా, అధునాతన హంగులతో సెక్రటేరియట్‌ను పర్యావరణహితంగా నిర్మించామన్నారు. ప్రకృతి ప్రేమికుడైన సీఎం కేసీఆర్ చొరవ వల్లే ఈ అవార్డు సాధ్యమైందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన హరితాహారం కార్యక్రమంతో రాష్ట్రంలో ఇప్పటికే గ్రీనరీ 7.7శాతం పెరిగిందన్నారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగానే సెక్రటేరియట్ నిర్మాణం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో సోలార్ విద్యుత్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసి, ప్లాటినం అవార్డును సైతం గెలుచుకుంటామని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోనే తొలి గోల్డ్ రేటెడ్ సెక్రటేరియట్ బిల్డింగ్ కాంప్లెక్స్‌గా తెలంగాణ సెక్రటేరియట్ గుర్తింపు పొందడం ఎంతో సంతోషం కలిగిందన్న ఆయన.. ఈ సందర్భంగా ఈఎన్సీ గణపతిరెడ్డి బృందానికి అభినందనలు తెలిపారు.

# మహోన్నతమైన విశ్వమానవ సౌధానికి శ్రమజీవుల త్యాగాలే పునాదిరాళ్లు : సీఎం కేసీఆర్



కార్మిక, కర్షక, శ్రమ జీవులకు ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. కార్మిక, కర్షక సంక్షేమాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. చెమట చుక్కలను ధారపోసి పరోక్షంగా సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న అందరికీ శుభాకాంక్షలు. తరతరాలుగా కష్టజీవి శ్రమతోనే ప్రపంచంలో సంపద దృష్టి జరుగుతోంది. మహోన్నతమైన విశ్వమానవ సౌధానికి శ్రమజీవుల త్యాగాలే పునాదిరాళ్లు అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. కార్మికులు ప్రమాదం కారణంగా మరణిస్తే రూ. 6 లక్షలు ఆ కుటుంబానికి చెల్లిస్తున్నామని సీఎం తెలిపారు. 2014 నుంచి నేటి వరకు 4001 మంది బాధిత కుటుంబాలకు రూ. 223 కోట్లు చెల్లించాం. ప్రమాదం కారణంగా వైకల్యానికి గురైన రూ. 5 లక్షల చొప్పున 504 మంది కార్మికులకు రూ. 89 కోట్లు చెల్లించాం. కార్మిక కుటుంబంలోని ఇద్దరు ఆడపిల్లల పెండ్లికి రూ. 30 వేల చొప్పున వివాహ బహుమతి ఇస్తున్నాం అని కేసీఆర్ గుర్తు చేశారు. 2014 నుంచి నేటి వరకు 46,638 మంది లబ్ధిదారులకు రూ. 130 కోట్లు చెల్లించాం అని సీఎం తెలిపారు. మహిళా కార్మికులకు 2 కాన్పుల వరకు రూ. 30 వేల చొప్పున ప్రసూతి ప్రయోజనాలు అందిస్తున్నాం. 2014 నుంచి నేటి వరకు 1,01,983 మంది లబ్ధిదారులకు రూ. 280 కోట్లు చెల్లించాం. కార్మికులపై ఆధారపడిన 1,49,536 మంది లబ్ధిదారులకు రూ. 94 కోట్లు చెల్లించాం. మరణానంతరం అంతిమయాత్ర కార్యక్రమాలకు 39,797 మందికి రూ. 98 కోట్లు చెల్లించాం అని సీఎం కేసీఆర్ తెలిపారు.




# పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే సత్తా కేసీఆర్‌కు మాత్రమే ఉంది: మంత్రి మల్లారెడ్డి

సీఎం కేసీఆర్‌మాదిరిగా పరిపాలన చేయడం ఎవరివల్లా కాదని మంత్రి మల్లారెడ్డి అన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన మేడే వేడుకల్లో అయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్ వల్లే హైదరాబాద్ కళకళలాడుతోందని కొనియాడారు. మహారాష్ట్రలోనూ వచ్చేది కేసీఆర్ సర్కారేనని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే సత్తా కేసీఆర్‌కు మాత్రమే ఉందన్నారు.

# థాయిలాండ్‌లో చికోటి ప్రవీణ్ అరెస్ట్.. 14 మంది మహిళలు కూడా..

క్యాసినో కింగ్ చికోటి ప్రవీణ్ మరోసారి వార్తల్లో నిలిచారు. చికోటిని థాయిలాండ్ పోలీసులు అరెస్ట్ చేశారు. థాయిలాండ్‌లోని పటాయలో మొత్తం 90 మంది ఉన్న ఇండియన్ గ్యాంబ్లింగ్ ముఠాను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో చికోటి ప్రవీణ్ కూడా ఒకరున్నారని వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ ముఠాలో 14 మంది మహిళలు ఉన్నారు. వీరి నుంచి భారీగా నగదు, గేమింగ్ చిప్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చీకోటి నేతృత్వంలోనే ఈ గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు కోట్ల రూపాయిల నగదు, సుమారు 21 కోట్ల రూపాయిలు విలువ చేసే గేమింగ్ చిప్స్, ఎనిమిది క్లోజ్డ్-సర్క్యూట్ టెలివిజన్ కెమెరాలు, 92 మొబైల్ ఫోన్‌లు, మూడు నోట్‌బుక్‌లను పోలీసులు సీజ్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చికోటి ప్రవీణ్‌ను స్పెషల్ బృందాలు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లుగా తెలుస్తోంది.




అయితే థాయిలాండ్‌లో నేరం చేసినట్లు తేలితే కఠిన శిక్షలు ఉంటాయన్న విషయం తెలిసిందే. అయితే చికోటి ప్రవీణ్ విషయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని ఆయన అభిమానులు, అనుచరులు ఆందోళన చెందుతున్నారు.

# మూసీ నదికి పోటెత్తిన వరద.. పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం



నల్లగొండ : మూసీ నదికి వరద పోటెత్తింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మూసీ నదికి వరద పరవళ్లు తొక్కుతోంది. మూసీ ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1,860 క్యూసెక్కులుగా ఉంది. మూసీ ఉపనది బిక్కేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సోలిపేట వద్ద ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాలను నిలిపివేశారు. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 632.7 అడుగులకు చేరింది. సూర్యాపేట, మేళ్లచెరువు, మఠంపల్లి, చివ్వెంల, హుజూర్‌నగర్, పాలకీర్తి మండలాల్లో సోమవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎలాంటి పంట నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com